ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 26 సంచిక : 8 మే 2021

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు
శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ఈ సంచికలో....

01-11-1987 కాపవరం

అక్షరమణమాల

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 01 నవంబర్ 1987, కాపవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనం గుడికి వెళ్ళేటప్పుడు భగవంతుడికి పళ్ళు తీసుకువెళతాం, వచ్చేటప్పుడు ప్రసాదం తెచ్చుకుంటాం. భగవాన్ ఏమి చెప్పారు అంటే అహంభావం లేకుండా మనం ఏమి తీసుకున్నప్పటికీ అది ప్రసాదమే అన్నారు. మనలో ఎక్కువ మందికి పూజ అంటే చాలా ఇష్టం. ధ్యానం అంటే అంత ఇష్టం ఉండదు. కొంచెం దూరంగా ఉంటాం దానికి, ఎందుచేత మన అందరికి పూజ అంటే ఇష్టం అంటే పూజ చేసేటప్పుడు, మన ఇంద్రియాలకు ఎక్కువ సంతృప్తిగా ఉంటుంది. ఆ పువ్వులు కోయటం, ఆ దండలు కట్టటం, అవి దేవుడి పటానికి వేయటం, అంటే పూజ చేయటం వల్ల మన ఇంద్రియాలకి ఒక రకమైన సంతృప్తి వస్తుంది. పూజ ఇంద్రియముల యొక్క పరిధిలో ఉంది. ధ్యానం ఏ పరిధిలో ఉంది? మనసు యొక్క పరిధిలో ఉంది. మనం ఆత్మని తెలుసు కోవటానికి, ఏ విషయాలు అయితే మనకి అడ్డు వస్తున్నాయో, ఆటంకంగా నిలబడి ఉన్నాయో, మన హృదయంలో ఉన్నటువంటి ఆ స్వర్గ రాజ్యంలో మన మనస్సు లయం అవ్వటం కోసం, మన మనసులో ఏ బలహీనతలు అయితే ఆటంకంగా ఉన్నాయో, ఆ ఆటంకాల్ని తొలగించేదే ధ్యానం. అందుచేత ధ్యానం చేయటం కొంచెం కష్టం

కాబట్టి దానిని మనం ఇష్టపడం. ధర్మం ధర్మం అని అంటారు ఎక్కువగా, ధర్మం అంటే ఏమిటి? ధర్మం అంటే మన యొక్క శరీరాన్ని సన్మార్గంలో నడిపేది ధర్మం. మన మనసులో బలహీనతలు తొలగించి ఏకాగ్రపరచేది ధ్యానం, ఇంద్రియాలను సంతృప్తి పరచేది పూజ. అయితే పెద్దలు అందరూ ధ్యానం చెయ్యమని చెప్పారు, ధ్యానం చేసేస్తే జ్ఞానం వచ్చేస్తుందా? పుస్తకాలు చదివితే జ్ఞానం వచ్చేస్తుందా? పూజ చేస్తే జ్ఞానం వచ్చేస్తుందా? మీలో కొంతమంది చెయ్యలేకపోవచ్చు, నేను చెయ్యలేకపోవచ్చు. కానీ కొంతమంది చేస్తున్నారు కదా. అయితే చేసేవాళ్ళు అందరికి జ్ఞానం వచ్చేసిందా? కొంతమంది ధ్యానం చేస్తున్నారు, పూజ చేస్తున్నారు, ధర్మమార్గంలో నడుస్తున్నారు. అంత మాత్రం చేత జ్ఞానం రాదు. మీరు గీత చదవచ్చు, వేదాలు పారాయణం చేయవచ్చు. భగవద్గీత పారాయణ చేసి, వేదాలు పారాయణ చేసినంత మాత్రం చేత జ్ఞానం రాదు. ఇవన్నీ చేయండి. నేను కాదు అనటం లేదు. అయితే ఇవన్నీ మీరు చేసినప్పటికీ తోటి మనిషి పట్ల మీ హృదయాంతరాళం నుంచి ఎంతోకొంత ప్రేమ రావాలి. మీరు ఎన్ని చేసినప్పటికీ మీకు ఆ ప్రేమ రాకపోతే మీకు జ్ఞానం కలగదు. సమాజం పట్ల, ఈశ్వరుడు పట్ల ప్రేమ హృదయాంతరాళం నుండి రావాలి. ప్రేమ అనండి, సేవ అనండి, అది హృదయంతరాళం లోంచి రావాల్సిందే. వీటి అన్నిటి యొక్క ఫలితం అది, ఆ ప్రేమ ప్రవాహంలో, ఆ compassion మానవజాతి పట్ల ఆ కరుణ, మానవ జాతి పట్ల ఆ జాలి, మానవజాతి పట్ల ఆ ప్రేమ, హృదయాంతరాళం నుండి గెంటుకుంటూ, గెంటుకుంటూ, మన హృదయం పక్కానికి వచ్చి mature అయ్యి ఆ ప్రేమ కనుక పుడితే, ఆ ప్రవాహం నుంచి జ్ఞానం పుడుతుంది. ఏదైతే మనం కాదో, ఏ తలంపులు అయితే మనం కాదో, ఏ మనస్సు అయితే మనం కాదో, మనది కానిది అంతా గెంటేసి ఏదైతే మనం అవునో దాన్ని పట్టి యిచ్చేదే జ్ఞానం. ఆ జ్ఞానం ఎక్కడ నుంచి వస్తుంది? పుస్తకాలు చదివితే వస్తుందా? రాదు. ఎక్కడ నుంచి వస్తుంది? అది హృదయం లోంచి రావాలి. ఆ ప్రేమ లోంచి జ్ఞానం కలుగుతుంది. భగవంతుడు చెప్పాడు గీతలో


**విహాయ కామాన్ యః సర్వాన్ పుమాంశ్చరతి నిస్పృహః**

**నిర్మమో నిరహంకారః స శాంతి మధి గచ్ఛతి ॥**

ఎవడైతే సమస్త కోరికలను విడిచిపెట్టి, వానియందు ఏమాత్రము ఆశలేక అహంకార, మమకార వర్జితుడై చరించునో అట్టి వాడే శాంతిని పొందును. నిర్మమః మమకారం లేకుండా ఉండమని, నిరహంకారః అహంకారం లేకుండా ఉండమని, విహాయ కామాన్ కామం అంటే ఏమిటి? ప్రోపర్‌గా అర్థం చేసుకోవాలి. భగవంతుడు ఏ ఉద్దేశంతోటి చెప్పాడో అది మనం correct గా అర్థం చేసుకోవాలి. మీలో ఎవరికైనా గౌరవం వచ్చింది అనుకోండి అది కామం కాదు. గౌరవం కావాలి అని మీరు కోరుకున్నారు అనుకోండి అది కామం. మీకు వచ్చింది కామం కాదు, మీరు కోరుకున్నది కామం. కామం అంటే కోరబడేది. మీరు ఏదైతే కోరుతున్నారో అది కామం. మీరు కోరకుండా ఏదైనా మీకు వచ్చింది అనుకోండి అది కామం కాదు. కాని మీరు కోరుకుంటే అది కామం. విహాయ కామాన్ సర్వాన్ ఎవడైతే ఏ పురుషుడైతే ఈ కోరికలను, విహాయ విడిచి పెడుతున్నాడో, సర్వాన్ అంటే అన్నీ విడిచి పెడుతున్నాడో కొన్ని విడిచి పెట్టి కొన్ని దాచుకోవడం కాదు. మనకున్న కుసంస్కారాలలో ఒక చిన్న సంస్కారం నిలబడి పోయినప్పటికీ, ఉండిపోయినప్పటికీ, హృదయంలో జ్ఞానం కలగదు. ఒక చిన్న వాంఛ. Slightest desire మిగిలిపోయినప్పటికీ ఇంక అక్కడ జ్ఞానానికి అర్హత లేదు. జ్ఞానానికి యోగ్యత లేదు. జ్ఞానానికి సమర్థత లేదు.

విహాయ కామాన్ యః సర్వాన్ సమస్త కోరికలను నిశ్శేషంగా విడిచిపెట్టు, శేషం రాకూడదు. ఎవడి హృదయంలో అయితే కోరికలు, ఆ వాంఛలు, నిశ్శేషంగా నశిస్తున్నాయో, వాళ్ళు మాత్రమే పురుషులు, మిగతా వాళ్ళు అందరూ స్త్రీలే అటండి. ఏమి అనుకోకండి పురుషులు. ఎవడైతే తాను మోక్షం పొందటానికి తనకి అడ్డుగా ఉన్నటువంటి విషయ వాంఛలను, ఆ

**మనకి ఏది మంచిదో మనకంటే గురువుకి బాగా తెలుసు. అందువలన మనము భగవంతుడు దగ్గరకు వెళ్ళినా, గురువు దగ్గరకు వెళ్ళినా ఆయన దయ, అనుగ్రహం తప్పించి ఇంకేమీ కోరుకోవద్దు.**



కోరికలను, ఆ సంస్కారాలని, ఎవడైతే తొలగించుకోటానికి ప్రయత్నం చేస్తున్నాడో అంటే ఎవడైతే సాధన చేస్తున్నాడో, ఎవడైతే పక్కానికి రావటానికి ప్రయత్నం చేస్తున్నాడో, ఎవడైతే వెలుగును చూడటానికి ప్రయత్నం చేస్తున్నాడో, ఎవడైతే జన్మ వచ్చినందుకు, సాధన చేసి ఆత్మను దర్శించటానికి ప్రయత్నం చేస్తున్నాడో, వాడు మాత్రమే పురుషుడు. నిర్మమః నిరహంకారః మమకారం లేకుండా, అహంకారం లేకుండా, శ్చరతి నువ్వు జీవించు. ఎలా జీవిస్తావు? మమకారం లేకుండా, అహంకారం లేకుండా జీవించు. నిస్పృహః అంటే కాంక్ష లేకుండా, దేని పట్ల స్పృహ లేకుండా విషయముల పట్ల స్పృహ లేకుండా జీవించు. అట్టివాడు మాత్రమే శాంతిని పొందును అని పరమాత్మ చెపుతున్నాడు.

ఒక్క విషయం మీరు జ్ఞాపకం ఉంచుకోండి. మీరు ఏ ఆశ్రమంలో ఉన్నప్పటికీ, గృహస్థ ఆశ్రమం అయినా బ్రహ్మచర్య ఆశ్రమం అయినా సన్యాసి ఆశ్రమం అయినా ఏ ఆశ్రమంలో ఉన్నప్పటికీ విషయచింతన చేసేవాడికి జ్ఞానం కలగదు. ఎవడైతే నిరంతరం బ్రహ్మను చింతిస్తున్నాడో, ఎవడైతే నిరంతరం బ్రహ్మను దర్శిస్తున్నాడో, ఎవడైతే నిరంతరం బ్రహ్మను స్మరిస్తున్నాడో, వాడే బ్రహ్మ స్వరూపాన్ని పొందుతాడు కానీ, విషయాన్ని చింతించే వాడు బ్రహ్మను పొందడు. ఇక్కడచిన్న secret, చిన్న litigation పెట్టాడు కృష్ణుడు. ఇప్పుడు నేను ఎవడను, నేను ఎవడను అని విచారణ చేసినంత మాత్రం చేత మన స్వరూపం మనకి తెలియదు. విచారణ మంచిదే, అది సహాయమే. ఇక్కడ కృష్ణుడు చెప్పినటువంటి litigation ఏమిటి అంటే ఇపుడు మనకి అందరము నేను, నేను అంటున్నాం. ధనవంతుడు అంటాడు, బీదవాడు అంటాడు, స్త్రీ అంటుంది, పురుషుడు అంటాడు, బాలుడు అంటాడు, వృద్ధుడు అంటాడు నేను నేను అని అందరూ అంటారు. నేను - నాది, నేను - నాది, ఇవి రెండు మనం నిరంతరం మరణించే వరకు ఉపయోగిస్తాము. ఇక్కడ మనల్ని లెంపలు వాయిస్తున్నాడు భగవంతుడు వాసుదేవ స్వామి. మీరు నేను ఎవరు అని విచారణ చేసినా, ధ్యానం చేసినా, జపం చేసినా, పూజ చేసినా, ఈ నేను తోటి, ఈ నాది తోటి మీరు జీవిస్తున్నంత కాలం, మీరు అహంభావాన్ని విడిచి పెట్టలేరు. ఇది పెద్ద litigation ఇక్కడ. మనం అందరం ధ్యానం చేసేస్తున్నాం. తెల్లవారు జామున లేస్తున్నాం, పూజ చేస్తున్నాం. మళ్ళీ సాయంత్రం ఒక గంటసేపు కూర్చొంటున్నాం. మళ్ళీ ధ్యానం

చేస్తున్నాం, కార్తికమాసంలో స్నానాలు చేస్తున్నాం. ఇప్పుడు కృష్ణుడు చెప్పింది ఏమిటి అంటే, అది కుదరదు అంటున్నాడు. అంత మాత్రం చేతే నీకు జ్ఞానం రాదు. అంత మాత్రం చేత మీకు మనోవికాసం రాదు. అంత మాత్రం చేత నా స్వరూపాన్ని నువ్వు పొందలేవు. కాలక్షేపం మాటలు, కాలక్షేపం పనులు కట్టిపెట్టండి అంటున్నాడు. అంత మాత్రం చేత సరిపోదు. మీకు పొలాలు ఉండవచ్చు. భవనాలు ఉండవచ్చు. రూపాయలు ఉండచ్చు. ఎన్ని ఉన్నప్పటికీ ఇవన్నీ ఉన్నాయి అనుకుంటున్నారు కానీ అసలు హృదయాంతరాళంలోకి నీ మనస్సు అంతర్ముఖం కాలేదు. హృదయంలో మనసు లయం కాలేదు. మీరు మోక్షాన్ని పొందలేరు, శాంతిని పొందలేరు. మేము భవనాలు కట్టాం, మాకు పొలాలు ఉన్నాయి, బ్యాంకులో అక్కౌంటులు ఉన్నాయి. ఇవన్నీ మీరు స్మరిస్తున్నారు కానీ మోక్షాన్ని గురించి ఎప్పుడైనా స్మరించారా? శాంతిని గురించి ఎప్పుడైనా స్మరించారా? మేము ధ్యానం చేస్తున్నాం, యాత్రలకు వెళ్ళాం. పూజలు చేస్తున్నాం, ఎన్నో శ్రవణాలు చేశాం. భగవద్గీత పారాయణ చేస్తున్నాం. ఎందరో పెద్ద పెద్ద వాళ్ళు ఉపనిషత్తులు చెబుతుంటే వింటున్నాం అని చెపుతున్నారు. అంత మాత్రం చేతే మోక్షం రాదు, శాంతి రాదు, జ్ఞానం రాదు. పరలోకరాజ్యం మీకు అందదు అని నేను అనటం లేదు, భగవంతుడు వాసుదేవస్వామి చెబుతున్నాడు.

నిర్మమః నిరహంకారః, నిస్పృహః ఇవి మూడు లేకుండా జీవించు. అప్పుడు కానీ ఈ అహంభావం పోదు. ఈ నేను నాది అనే వలయం లోంచి, ఆ చక్రం లోంచి, ఎప్పుడైతే నువ్వు బయట పడ్డావో అప్పుడు నీకు అహంభావం పూర్తిగా నశిస్తుంది. ఈ నేనుకు సంబంధించిన తలంపులు నిన్ను వెంటాడుతున్నప్పుడు, నీ కూడా ఉంటున్నప్పుడు, నువ్వు ఎన్ని ధ్యానాలు చేసినా, జపాలు చేసినప్పటికీ నువ్వు మోక్షానికి అర్హుడవు కాదు. నీకు అహంభావం నాశనం కాదు. అహంభావాన్ని ఉత్పత్తి చేసేది ఈ నేను అనే తలంపే. అహంభావాన్ని ఉత్పత్తి చేసేది ఈ నాది అనే తలంపే. ఇవి రెండు తలంపులను తలచుకుంటూ నువ్వు ఎన్ని జపాలు చేసినప్పటికీ, ఎన్ని సాధనలు చేసినప్పటికీ మోక్షానికి అర్హుడవు కాదు. మోక్షంతో సంబంధం నీకు రాదు అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. నిర్మమః నిరహంకారః నిస్పృహః ఇవి మూడు పట్టుకుని జీవించు. నువ్వు అలా జీవిస్తున్నట్టు అయితే వాడు మాత్రమే శాంతిని పొందుతాడు. శాంతి మధి గచ్ఛతి

వాడు మాత్రమే శాంతిని పొందుతాడు. ఎవడు మాత్రమే శాంతిని పొందుతాడు? విషయముల పట్ల స్పృహ లేనివాడు, లోకం పట్ల స్పృహ లేనివాడు, విషయ వాంఛల పట్ల స్పృహ లేనివాడు, అహంకారం లేనివాడు, మమకారం లేనివాడు, నేను, నాదికి దూరంగా ఉన్నవాడు, వాడు మటుకే శాంతిని పొందుతాడు. మీకు ఎంత ధనం ఉన్నా శాంతి రాదు. శాంతి బజారులో కొనుక్కునేది కాదు. నీ హృదయంలో ఏముందో నువ్వు తెలుసుకోలేకపోతే హృదయంలో ఉన్న ఆత్మని నువ్వు గ్రహించలేకపోతే, ఒకవేళ మీరు పారిపోదాం అన్నా, మీ శరీరాన్ని హత్య చేసుకున్నప్పటికీ మీకు శాంతి దొరకదు, శాంతి దొరకదు. మీరు జీవించి ఉండగానే మీ హృదయంలో ఉన్న ఆత్మని మీరు దర్శించాలి. సాక్షాత్కరించుకోవాలి అప్పుడే మీకు శాంతి దొరికేది. అప్పుడు ఈ నేను, నాది అనేది పోతుంది. ఈ నేను, నాది నశించేంతవరకు అహంకారం ఉత్పత్తి అవుతూనే ఉంటుంది. అహంకారం విజృంభిస్తూనే ఉంటుంది. ఈ నేను విజృంభిస్తుంది అంటే ఏమిటో అనుకుంటాం. అహంకారం నేను రూపంలో విజృంభిస్తుంది కాబట్టి అదే శిరస్సు అన్నారు రమణమహర్షి గారు. మరి ఏది పాదం అంటే ఈ అహంకారం ఎక్కడైతే లయం అవుతుందో అది పాదం. అహంకారం ఎక్కడ విజృంభిస్తుందో అది శిరస్సు.

పొట్లకాయలు కావాలా? బీరకాయలు కావాలా? టమాటాలు కావాలా? వంకాయలు కావాలా? అని మీ ఊర్లో అమ్ముతున్నారా అండి? రోడ్డు మీద కేకలు వేస్తారు కదా, పూర్వం ఒకడు ఏమి చేశాడు? మీకు ప్రేమ కావాలా? ప్రేమ కావాలా? అని కేకలు వేశాడు. వీళ్ళందరూ అంతకుముందు పొట్లకాయలు మాట, వంకాయల మాట విన్నారు కానీ ఈ ప్రేమ మాట వినలేదు. ప్రేమ కావాలా? ప్రేమ కావాలా? అని వెర్రి కేకలు వేసుకుంటూ వెళుతున్నాడు. వీళ్ళు మెల్లిగా ఆ కిటికీ తలుపులు, ఆ గుమ్మాలు లోంచి చూస్తున్నారు. అంటే ధైర్యం చాలటం లేదు. ఒకావిడ ధైర్యం చేసి, ప్రేమ కావాలి ఎంతకి ఇస్తావు అని అడిగింది. నీ తలకాయ ఇస్తే ఇస్తాను అన్నాడు. అమ్మ బాబోయ్. భయం వేసింది ఆవిడకి, గబ గబ వెళ్ళి తలుపులు వేసేసుకుంది. తలకాయని ఎవడు ఇస్తాడు? ఒక పావల ఎక్కువ అయినా రేటు ఎక్కువ చెబితే ఇస్తాడు కానీ తలకాయ ఎవడు ఇస్తాడు? అన్నిటికంటే మనకి తలకాయ ఇష్టం. ఏమండీ, డాక్టరు గారు కాళ్ళు తీసేసినా, చేతులు తీసేసినా ఊరుకుంటాం కానీ తలకాయ

తీసేస్తే ఊరుకోము. రమణమహర్షి గారికి చేతి మీద కురుపు వేసినప్పుడు డాక్టరు గారు సలహా చెప్పారు ఏవండీ స్వామి మీ చెయ్యి కొట్టించేసుకోవటమే మంచిది అని, అప్పుడు భగవాన్ అన్నారట ఇప్పుడు ఈ కాన్సర్ నా తలకాయకి వస్తే నా తలకాయ తీసేస్తారా అని? కానీ వీడు ఏమి అడుగుతున్నాడు? తలకాయ అడుగుతున్నాడు. అంటే తలకాయ ఇవ్వటం అంటే ఏమిటి? ఎవడైతే అహంకారాన్ని ఇచ్చేశాడో వాడికి ప్రేమను ఇస్తాడు. అంటే అహంకారం ఉన్నంత సేపు ఎవడు తోటి మానవుడిని ప్రేమించలేడు. అహంకారం ఉన్న మనిషికి అసలు ప్రేమ అనేది తెలియదు. అహంకారం ఎప్పుడైతే జారిపోయిందో, వాడి ఇంద్రియాలు, వాడి ముఖము, వాడి శరీరం, వాడి మనసు అంతా ప్రశాంతంగా ఉంటాయి.

మనకి ఈ లోకం అంతా ఎలా కనిపిస్తోంది? లోకం లాగే కనిపిస్తోంది. భగవంతుడు ఏమి చెప్పాడు? ఉన్నది ఒక్కటే వస్తువు అది బ్రహ్మము అని చెప్పాడు. అయితే ఉన్నది ఒక్కటే వస్తువు అయినప్పుడు నాకులోకం ఎందుకు కనిపిస్తోంది? కనిపించేది అంతా కూడా మనకి లోకం కింద కనిపిస్తోందా? బ్రహ్మం కింద కనిపిస్తోందా? లోకంగానే కనిపిస్తుంది. అబద్ధం వద్దు, మనకి లౌక్యం వద్దు. లౌక్యం వల్ల లాభం లేదు, లౌక్యుడు ఆధ్యాత్మికజీవితానికి అసలు పనికిరాడు. ఉన్నది అంతా బ్రహ్మ స్వరూపం అయినప్పుడు మనకి లోకంగా ఎందుకు కనిపిస్తోంది? భగవంతుడు చెప్పే statement కరెక్టు. కానీ బ్రహ్మం బ్రహ్మంగా కాకుండా బ్రహ్మం లోకంగా కనిపించడానికి గల కారణం మన మనసులో ఉన్న బలహీనతలు. మన మనసులో ఉన్న దోషాలు కనుక పోతే, మన మనస్సులో ఉన్న బలహీనతలు కనుక పోతే ఉన్న వస్తువు ఉన్నట్టుగా కనిపిస్తుంది. అందుచేత వస్తువు ఇక్కడే ఉంది. అంతటా వ్యాపించి ఉన్న వస్తువు మన హృదయంలో కూడా ఉంది. మన హృదయంలో ఉన్న బ్రహ్మము మనకి అవగాహన అవ్వటం కోసం మన బుద్ధి నిర్మలం అవ్వాలి. మన బుద్ధి స్వచ్ఛం అవ్వాలి. మన బుద్ధి కనుక



**రాగద్వేషాలు తగ్గించుకుంటే, హింసా విధానం తగ్గించుకుంటే మీ మనస్సు మీకు తెలియకుండా ఆత్మ ఆకారం చెందుతుంది.**

స్వచ్ఛం అయితే, మన బుద్ధి కనుక నిర్మలం అయితే, బుద్ధి కనుక ఏకాగ్రం అయితే అది బ్రహ్మాకారం చెందుతుంది. బ్రహ్మం ఇక్కడే ఉంది. బుద్ధిలో ఉన్న దోషాలు ఎప్పుడైతే పోయాయో, ఉన్న వస్తువు ఉన్నట్టుగా మనకి కనిపిస్తుంది. అంటే ఇదంతా బ్రహ్మమే. మన బలహీనతలు ఎప్పుడైతే రాలిపోయాయో, అప్పుడు ఉన్న వస్తువు ఉన్నట్టుగా కనిపిస్తుంది. అది చివరి జన్మ, అది కడసారి జన్మ. అన్నిటికంటే ఉత్తమమైనది మౌనం. అయితే మౌనం అంటే ఏమిటి? మౌనం అంటే భగవంతుడు. భగవంతుడికి మరొక పేరే మౌనం. ఆత్మకి మరొక పేరే మౌనం.

ఒక్క విషయం మీరు ఆలోచించండి. దేహానికి వ్యాధి వస్తే కంగారుపడుతున్నారు, మందులు వాడుతున్నారు. కానీ దేహమే ఒక వ్యాధి అన్నారు భగవాన్. దేహం వచ్చిన తరువాత రోగం వస్తుంది. దేహం వచ్చాక ముసలితనం వస్తుంది. దేహం వచ్చాక మరణం వస్తుంది. దేహం వచ్చిన తరువాత కష్టం వస్తుంది. ఇవన్నీ దేహం వచ్చాకే మనకి వస్తున్నాయి. అసలు దేహం అనే వ్యాధి ఎందుకు వచ్చింది అని విచారణ మీరు ఎందుకు చెయ్యరు? కారు లోంచి దిగి వెళ్లిపోతున్నాం అనుకోండి బాధపడము. కానీ దేహం లోంచి దిగి వెళ్లిపోయేటప్పుడు మటుకి చాలా దుఃఖం కలుగుతుంది. ఎందుచేత దుఃఖం కలుగుతుంది మనకి? దేహం తోటి తాదాప్యం పొందాం. మన మనస్సులో ఉన్న ఉద్దేశాలకి ఎవరైనా భంగం చేస్తే అప్పుడు కూడా దుఃఖం వస్తుంది మనకి. ఎందుచేత దుఃఖం వస్తుంది? మనసు తోటి తాదాప్యం పొందాం కాబట్టి, ఈ దేహం తోటి ఈ మనసు తోటి మనం ఎంతకాలం అయితే విడువడమో, అంతకాలం మనకి దుఃఖం తప్పదు. ఇప్పుడు నేను ఎవడని, నేను ఎవడని అని ప్రశ్న వేసుకుంటే ఆ ప్రశ్నకి జవాబే బ్రహ్మము. నేను ఎవడను నేను ఎవడను అన్న ప్రశ్న వేసుకున్నంత మాత్రం చేత జవాబు రాదు. మనస్సు అణగాలి. మన మనస్సు విజృంభిస్తుంటే ఆ విజృంభిస్తున్న మనస్సు వేగం అణగటం కోసం రజోగుణం తగ్గటం కోసం, తమోగుణం తగ్గటం కోసం, నేను ఎవడను అనే ప్రశ్న ఉపయోగపడుతుంది. ఇది విచారణమార్గం. మీరు నేను ఎవరు అని విచారణ చేయవచ్చు ఇది మీ మనస్తత్వానికి సరిపోక పోతే ఏదైనా మీకు ఇష్టమైన నామాన్ని తీసుకుని ఆ ఇష్టమైన నామాన్ని స్మరణ చెయ్యటం వల్ల కూడా మీకు స్వరూపదర్శనం అవుతుంది. ఎందుచేత అంటే మనకి ఇష్టమైన నామం తదేకంగా స్మరించగా స్మరించగా మనకి ఆటంకంగా

ఉన్న తలంపులు, మనల్ని బహిర్ముఖం చేస్తున్న తలంపులు, మనల్ని బహిర్ముఖం చేస్తున్న ఆలోచనలు అన్నీ కూడా ఒకొక్కటి ఒకొక్కటి మాడిపోవటం ప్రారంభిస్తాయి. అయితే ఎన్ని చేసినప్పటికీ మన దైనందిన జీవితంలో అహంకారం పెరగకుండా చూసుకోవాలి. దైనందిన జీవితంలో మనం చేసే పనుల విషయంలో అహంకారం విజృంభించకుండా చూసుకోవాలి.

ఒకసారి రామకృష్ణపరమహంసగారు కాళీ గుడిలో కూర్చొన్నారు. ఎవరో కొత్త ఆయన వచ్చారు. కొత్తాయనకి ఈయన రామకృష్ణ పరమహంస గారు అని తెలియదు. ఏవండీ పంతులుగారు ఇలా రండి అని కేక వేశారు. వచ్చాడు ఆయన. ఈ పక్కనే పువ్వుల తోట కనిపిస్తోంది, వెళ్ళి కొన్ని పువ్వులు కోసుకురండి అన్నాడు. ఆయన కోసుకొచ్చి ఈయనకి ఇచ్చాడు. మీరు వెళ్ళి కూర్చోండి మీ పని చూసుకోండి అన్నాడు. తరువాత ఇంకొక గంటకి ఎవరో కొంతమంది పెద్దలు వచ్చారు. వచ్చి ఈయనకి నమస్కారం పెట్టి, ఈయనతోటి మాట్లాడుతున్నారు. ఆ సన్నివేశం చూడండి. పది నిమిషాలు మాట్లాడి వాళ్ళు వెళ్ళిపోయారు, ఏవండీ నన్ను క్షమించండి, పరమహంస గారికి ఇవ్వడానికే నేను పువ్వులు కోయమని చెప్పాను, మీరే అని నాకు తెలియదు. నాకు బజారులో టైముకి పువ్వులు దొరకలేదు. అందుచేత నన్ను క్షమించి మీరు ఆశీర్వదించండి. మీరే అని నాకు తెలియకుండా మీచేతే నేను పువ్వులు కోయించాను. మీరే పరమహంస గారు అని చెబుతున్నారు. మిమ్మల్నే చూడటానికి వచ్చి ఈ పని మీ చేతే చేయించాను అన్నాడు. పరమహంస గారు ఒక చక్కటి మాట చెప్పారు. నన్ను పువ్వులు కోయమని అడిగింది మీరు కాదు. కాళీ అడిగింది. నేను పువ్వులు కోసి ఇచ్చింది మీకు కాదు కాళీకి ఇచ్చాను. అందుచేత మీ క్షమాపణ తోటి నాకు పనిలేదు. అసలు మీరు క్షమాపణ చెప్పుకోవలసిన అవసరమే లేదు. అంటే మన దైనందిన జీవితంలో ప్రతి సంఘటనలో ఆ భావన కనుక ఉంటే అహంకారం యొక్క విజృంభణ చల్లబడిపోతుంది, తగ్గిపోతుంది. బ్రహ్మస్వరూపాన్ని గురించి ఊరికే వినటం మాత్రం చేత అయిపోడు వాడు. వాడు బ్రహ్మ స్వరూపాన్ని చూస్తుంటే ఆ స్వరూపాన్ని పొందుతాడు. విన్నంత మాత్రం చేత అవ్వడు. అనుభవిస్తే అవుతాడు. ఏవండీ మీకు అందరికి దేవుడు కావాలి ఇప్పుడు, ఒకవేళ నిజంగా కనిపిస్తాడు అనుకోండి దేవుడు, ఏమి చేసుకుంటారు మీరు దేవుణ్ణి? ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి మీరు.

మనం నేను నేను అంటున్నాం. ఈ నేను యొక్క సృష్టే దేవుడు. ఈ నేను యొక్క కల్పనే ఈ లోకం, ఈ నేను యొక్క కల్పనే ఈ శరీరం. ఈ నేను యొక్క కల్పనే ఈ మనస్సు. ఈ నేను యొక్క కల్పనే కాలం. ఈ నేను యొక్క కల్పనే జన్మ. ఈ నేను యొక్క కల్పనే మరణం. ఈ పునర్జన్మ కూడా ఈ నేను యొక్క కల్పనే. ఏ నేను? ఇప్పుడు మనం అనే నేను. మీ మనస్సుకి అందనటువంటి, మీ ఇంద్రియాలకి అందనటువంటి, మీ బుద్ధికి అందనటువంటి, మీ తెలివితేటలకి అందనటువంటి అమోఘమైన శాంతి, అద్భుతమైన శాంతి మీకోసం మీ హృదయంలో కనిపెట్టుకొని ఉంది, మీరు శాంతికి నిలయం. అది మీ హృదయంలోనే ఉంది. ఆ శాంతి మీ కోసం ఎదురు చూస్తోంది. నిరంతరం హృదయాన్ని ధ్యానం చెయ్యండి. ఆత్మను ధ్యానం చెయ్యండి. ఆత్మను స్మరించండి. శరీరంలో ఉండగానే మీకు ఆ శాంతి దొరుకుతుంది. ఆ శాంతి మీకు చిక్కిందా ఆ ప్రవాహంలో ఈ నేను నాది కూడా కొట్టుకుపోతాయి.

మనందరికీ ఒకే రకమైన తలంపు రాదు. లోపల ఉన్న వాసన బట్టి తలంపు వస్తుంది. తిన్న కూరని బట్టి తేనుపు వస్తుంది. ఒక కూర తింటే ఇంకొక తేనుపు రాదు. మన హృదయంలో ఉన్న వాసనని బట్టి మనకి తలంపు వస్తుంది. మన హృదయంలో దానికి సంబంధించిన వాసన లేకపోతే అసలు తలంపే రాదు. ఈ వాసన యొక్క వయసు ఎక్కువ, మన శరీరం యొక్క వయసు తక్కువ. అంటే మనం మరణించేటప్పుడు ఈ ప్రాణం, ఈ మనస్సు, మనతో ప్రయాణం చేస్తూనే ఉంటాయి. దేహం ఒక్కటే మనల్ని విడిచి పెట్టేది. మనల్ని మన ప్రాణం విడిచి పెట్టదు, మనస్సు విడిచి పెట్టదు. మరణానంతరం కూడా మన కూడా ప్రయాణం చేస్తూనే ఉంటుంది. అందుచేత ఈ ప్రాణాన్ని, ఈ మనస్సుని, ఈ ఇంద్రియాలను కూడా సంస్కరించుకోవాలి మనం, ఎందుచేత అంటే మరణానంతరం ఇవి మనకూడా వస్తాయి. ఏవి ఒకటి ప్రాణం, రెండు మనస్సు, మూడు ఇంద్రియాలు. అందుచేత వాటిని సంస్కరించుకుంటేనే సాధన. మీరు పూజ చేయండి, ధ్యానం చెయ్యండి, జపం చేయండి. ఏది చేసినా మీ మనస్సుని ఎంతవరకు సంస్కరించుకుంటున్నారు. ఇంద్రియాలను ఎంతవరకు మనం బాగు చేసుకుంటున్నాం. మన బుద్ధిని ఎంతవరకు మనం బాగు చేసుకుంటున్నాం. అదే మీరు సెంటర్‌గా పెట్టుకోవాలి. వాటిని సంస్కరింప చేసుకోవటమే సాధన. అనేక తలంపులు

వస్తూ ఉంటాయి, వాసనని బట్టి తలంపు వస్తూ ఉంటుంది. తలంపు వచ్చిన వెంటనే దానిని actionలో పెట్టకండి. మీకు మనస్సులో ఒక తలంపు రావచ్చు. వెంటనే నోటికి పని చెప్పకండి. ఎవరినైనా గట్టిగా తిట్టాలి అని మీకు అనిపిస్తుంది అనుకోండి కొంచెం నిగ్రహించుకోండి. నోటికి అప్పుడే పని చెప్పేయకండి. ఎందుచేత అంటే నోటికి మీరు పని చెబితే ఆ వచ్చిన తలంపు బలపడిపోతుంది. బలపడిపోయి ఏమి చేస్తుంది? మళ్ళీ సంస్కారరూపంలో హృదయంలోకి దిగిపోతుంది. అందుచేత ఎక్కడ నుండి ఆ తలంపు వచ్చిందో, ఆ తలంపు మూలంలోనే దానిని విచారణ చేసి దానిని కత్తిరించాలి. గ్రంధి అంటే ఏమిటి? మనస్సు అన్నా, చిజ్జడ గ్రంధి అన్నా, అహంకారం అన్నా ఇవన్నీ ఒక్కటే అని రమణ స్వామి చెప్పారు. భగవాన్ ఏమి అన్నారు అంటే గ్రంధి తెగాలి అని చెప్పారు.

వేదాలలో అనేక విషయాలు చెప్పారు. వేదం గొప్పదే, కానీ అందులో అనేక విషయాలు చెప్పారు. భగవాన్ అలా కాదు, ఏది మీరు తెలుసుకుంటే మీరు మోక్షాన్ని పొందుతారో, ఏది ప్రధమమో, ఏది ప్రధానమో, అదే చెప్పాడు. అక్కర్లేని విషయం ఒక్కటి ముట్టుకోలేదు ఆయన. భగవాన్ ది ఒక్కటే గురి. ఏది తెలుసుకుంటే మీరు బాగుపడతారో, దాని మీద లక్ష్యం పెట్టు అన్నారు. ఆత్మ తప్పించి ప్రతీది స్వప్నమే. ఇంక diversion వద్దు, చాపల్యం వద్దు. మీ మనస్సు చలించిందా, మీరు ఆత్మను ధ్యానం చేసే శక్తిని కోల్పోతారు. ఆత్మని శ్రవణం చేసే శక్తిని కూడా కోల్పోతారు అంటున్నాడు రమణస్వామి. రమణస్వామి గ్రంధి గురించి చెప్పారు. గ్రంధి అంటే ఏమిటి? మనస్సుకి ఇంకొక పేరు పెట్టారు గ్రంధి అని, బంధమే గ్రంధి. ఏది బంధం? మీలో ఎవరైనా సంతానం లేని వారు ఉండచ్చు. సంతానం ఉన్న వాళ్లకు బంధం కానీ మాకు సంతానం లేదు ఇంక బంధం ఏమిటి అనుకోకండి. అది బంధమే, అసలు దేహం అంటేనే

**భగవంతుడు చెప్పే మాటల మీద ఎంతవరకు నీకు విశ్వాసం కలుగుతోందో, అంతవరకూ దేవుడి యొక్క కృప నీ మీద ఉన్నట్టే!**



బంధం. మీకు పిల్లలు లేకపోయినా దేహం ఉంది కదా, ఏమండీ ఈ శరీరం మాది కాదు అని చెప్పేవాళ్ళు ఎవరైనా ఉన్నారా? ఈ శరీరం నాది అనే భావన లేనివాళ్ళు ఇక్కడ ఎవరైన ఉన్నారా అసలు, స్త్రీలలో కానీ, పురుషులలో కానీ మీకు పొలాలు లేకపోవచ్చు, రూపాయలు లేకపోవచ్చు. పదవులు లేకపోవచ్చు. ఏమీ లేకపోయినా చివరికి పెట్టుకోవడానికి గోచి గుడ్డ కూడా లేకపోయినా అందరికీ శరీరం ఒకటి ఉంది కదా. ఈ శరీరం నాది అనే భావన లేనివాళ్ళు ఎవరైనా ఉన్నారా? పామరుడికి ఆ భావన ఉంది, పండితుడికి ఆ భావన ఉంది. స్త్రీకి ఉంది, పురుషుడికి ఉంది, పశువుకి కూడా ఉంది. పైకి చెప్పలేదు కానీ ఈ శరీరం నాది అనే భావన పశువులకి కూడా ఉంది. ఈ శరీరం నాది అనే భావన లేనివాడు ఈ సృష్టిలో ఎవరైనా ఉన్నారా? ఎవరు లేరు. అంటే ఈ శరీరం నాది అని అనుకుంటున్నాను కాబట్టి ఎవరిని ఈ శరీరాన్ని ఏమి అననివ్వను. ఏమండీ ఎవరైనా నా శరీరాన్ని అంటే నేను ఊరుకుంటానా? నాకెంతో పౌరుషం వస్తుంది. దేవుడు లేడు అని అంటే నేను ఊరుకుంటాను కానీ నా శరీరాన్ని ఎవరైనా మాట అంటే మటుకు నేను ఊరుకోను. ఎందుచేత? శరీరం నాది అనుకుంటున్నాను. ఈ శరీరం నాది అనుకునే భావనే బంధం. ఈ బంధం లేనివాడు సృష్టిలో ఎవడైనా ఉంటే వాడే జ్ఞాని.

మోక్షం ఇక్కడే ఉంది, నా హృదయంలోనే ఉంది మోక్షం. అయితే నాకు దేహభావన ఉంది. అంటే దేహం నేను అనే భావన, ఈ దేహం నాది అనే భావన, ఈ గ్రంధి నాకు అడ్డు వస్తోంది. మనం చేసుకున్న కర్మను బట్టి మనకి ఒక దేహాన్ని తీసుకు వచ్చి ఇది నాదే అనే భావనని కలుగజేసి మాయ మనలను కట్టేసింది, దూడను కట్రాడుకి కట్టినట్టు, ఈ దేహం నాది నాది అనుకునే భావన మనలను కట్రాడుకి కట్టేయక్కర్లేదు ఈ భావనే కట్రాడు మనకి. ఈ తలంపే కట్రాడు, దూడను కట్టే కట్రాడు విరిగిపోతే విరిగిపోతుంది కానీ ఇది విరగదు. ఈ దేహం నాది అనే భావన జన్మజన్మల నుంచి, యుగయుగాల నుంచి బాగా పాతుకుపోయింది. ఈ దేహమే ఆత్మ అనుకునే బుద్ధి హృదయాంతరాళంలో పాతుకుపోయింది. దేవుడి గురించి విన్నా, శాస్త్రం గురించి విన్నా, సద్గురువులు చెప్పే మాటలు విన్నా ఈ బంధం తెగటం లేదు. ఎవరో కోట్లాది మందిలో ఎవడో ఒకడు సాధన చేస్తాడు. ఆ సాధన చేసే కోట్లాది మందిలో

ఒక్కడికే ఈ బంధం తెగుతుంది అని పరమాత్మ చెప్పాడు. ఇక్కడ బంధం లేనివాడు ఎవడైనా ఉన్నాడేమో చెప్పమనండి. మీకు బ్యాంకు అకౌంటులు లేకపోవచ్చు. పిల్లలు లేకపోవచ్చు, భవనాలు లేకపోవచ్చు, స్థలాలు లేకపోవచ్చు, కానీ మీకు ఒక దేహం ఉంది, ఆ దేహం నాది అనే భావన ఉంది మీకు. దేహం నాది అనే భావన ఉంది కాబట్టే మరణించేటప్పుడు నేను మరణిస్తున్నాను, నేను మరణిస్తున్నాను అనుకుంటాడు ప్రతి వాడు. ఏవండీ అందరూ అనుకుంటారు కదా అప్పుడు, నాకు టైం అయిపోయింది అండి, ఇంక రెండు రోజులకి మించి బ్రతకను అండి అంటాడు. చచ్చిపోయేవాడు ఎవడు? దేహం మరణిస్తుంది. అంటే దేహం వాడే అనుకుంటున్నాడు కాబట్టి, నేను మరణిస్తున్నాను అని వాడు అంటున్నాడు. అందుచేత ఆ బంధం మరణించేటప్పుడు కూడా తెగదు. ఒకవేళ మరణించేటప్పుడు ఆ బంధం తెగిందా, ఆ సెకనులో వాడికి మోక్షం ఇస్తాను అంటున్నాడు భగవంతుడు. మీకు ఇప్పుడు బంధం తెగక్కర్లేదు. ఒకవేళ మీ పూర్వ పుణ్యాన్ని బట్టి, మీరు చేసే నోములని బట్టి చివరి క్షణంలో, ఆ చివరి శ్వాస శరీరాన్ని విడిచి పెట్టే టైములో అయినా నీకు ఈ శరీర బంధం తెగిపోయిందా నీకు అప్పుడైనా మోక్షాన్ని ఇస్తాను అంటున్నాడు భగవంతుడు వాసుదేవ స్వామి. అలా ఎవరికి అయితే జరిగిందో, దేహబుద్ధి ఎవడికి అయితే రాలిపోయిందో, వాడే జీవన్ముక్తుడు, వాడే మహా పురుషుడు, వాడే మహాత్ముడు. దీపావళి రోజున భగవాన్‌ను ఎవరో పద్యాలురాయమన్నారు, భగవాన్ ఏమి చెప్పారు అంటే నరకం ఎక్కడో లేదు అయ్యా, ఈ దేహమే నరకం అన్నారు ఆయన. మరి నరకాసురుడు ఎవడు? ఈ దేహం నాది, ఈ దేహం నాది అని అందరూ అనుకుంటున్నారు. అంటే వాడే నరకాసురుడు. నరకాసురుడు ఎవరో అనుకుంటున్నాం, మనం అందరం నరకాసురలమే అటండి. దేహం నేను, దేహం నేను ఈ నరకం నేను అని ఎవడైతే అనుకుంటున్నాడో, ఈ దేహం నేను నేను అనే బుద్ధి అందరికి ఉంది కదా, దేహం నేను అనే తలంపు ఉంది కదా, దేహం నేను అనుకునేవాడు నరకాసురుడు. ఆ నరకాసురుడిని ఎవడు చంపాడు? కృష్ణుడు చంపాడు. ఈ దేహాన్ని నేను అనుకునే బుద్ధిని విచారణ చేసి ఎవడైతే పోగొట్టుకుంటాడో వాడు నరుడు కాదు వాడు నారాయణుడు అవుతాడు.

ఏ రోజున అయితే మీరు సత్యాన్ని తెలుసుకున్నారో, ఏ రోజున అయితే మీరు ఆత్మని

దర్శించారో, మీ స్వరూపం మీకు ఎప్పుడైతే దర్శనం ఇచ్చిందో, అదే దీపావళి. మీకు ఎప్పుడైతే జ్ఞానం కలిగిందో ఆ రోజే దీపావళి. ఇప్పుడు మనం చేసుకొనే పండుగ దీపావళి కాదు. మీ హృదయంలో ఉన్నటువంటి వెలుగును ఎప్పుడైతే మీరు చూడగలిగారో అదే నిజమైన దీపావళి. అందుచేత చేసిన కర్మ అనుభవించటానికి ఈ దేహం వచ్చింది. అంటే ఒక ఎద్దుని మనం కొట్టాలి అనుకోండి ఎద్దుని కట్రాడుకి కట్టేస్తే బాగా కొట్టగలం. అలా భగవంతుడు మనలని ఏమి చేశాడు దేహమే ఆత్మ అనుకునే బుద్ధిని మనకు పెట్టి మనల్ని ఎడా పెడా వాయిస్తున్నాడు. ఈ విషయం మీకు అర్థం అయ్యిందా, మీ సంకెళ్ళు తెగిపోతాయి. ఒక్కసారి మాయలోంచి బయట పడతాం. పశువులు అంటే ఏమిటి? దేహభావన ఉన్న వాళ్ళు అందరూ పశువులు, అంటే జీవ లక్షణాలు ఉన్నవాళ్ళు అందరూ పశువులు. ఈ జీవలక్షణాలను ఎవడైతే విడిచి పెట్టాడో వాడు పశుపతి అవుతాడు. అంటే వాడు నారాయణుడు అవుతాడు. నారాయణుడు ఎక్కడ ఉన్నాడు? మన హృదయంలోనే ఉన్నాడు. మీరు బాగా సంపాదించారు అండి, మీకు ఎంత డబ్బు ఉందో అండి అని ఎవరిని అయినా అనండి. వాళ్లకు ఎంత సంతోషం వచ్చేస్తుందో. ఆ సంతోషించేది కూడా అహంకారమే. దుఃఖం, సంతోషం వచ్చేది కూడా లోపల అహంకారానికే. అందుచేత ప్రతీది అహంకారమే, జన్మే అహంకారానిది. అందుచేత రమణస్వామి చెప్పారు అహంకారం ఉంటే అంతా ఉంది. అహంకారం ఉంటే నువ్వు ఉన్నావు, అహంకారం ఉంటే నేను ఉన్నాను. అహంకారం ఉంటే లోకం ఉంది, అహంకారం ఉంటే దేవుడు ఉన్నాడు. అహంకారం ఉంటే నరకం ఉంది, అహంకారం ఉంటే స్వర్గం ఉంది. అహంకారం ఉంటే లోకాలు ఉన్నాయి, అహంకారం ఉంటే అంతా ఉంది. అహంకారం లేకపోతే ఏది లేదు అన్నాడు రమణస్వామి.

సోదరమహాశయులారా! మీరు వద్దు అన్నా, మీరు అక్కర్లేదు అన్నా, మీరు కాదు అన్నా, ఎక్కువగా ఏ తలంపు అయితే మీ బుర్రలోకి వస్తుందో, ఆ తలంపు గురించి మీరు పూర్వజన్మలో జీవించారు. దానిని మీరు ఎక్కువ ఆచరణలో పెట్టారు. ఆ తలంపు వచ్చి మన శిరస్సు మీద ఇప్పుడు కూర్చుంది. దానిని పోగొట్టటానికి పూజలు మొదలు పెట్టాము. ఆ తలంపుని మనంతటి మనం గెంటుకునే శక్తి లేక ఈశ్వరుడి సహాయం అడుగుతున్నాం.

ఈ మధ్యన ఒకరు ఒక ఉత్తరం రాశారు నాకు, ఏమని ఉత్తరం రాశారు అంటే బాహ్యగురువు తోటి పని ఏమిటి అని, ఇది మీరుబాగా అర్థం చేసుకోండి, మనం ఏమి అనుకుంటున్నాం? మనం దేహం అనుకుంటున్నాం, మనం నిజంగా ఆత్మలమే. కానీ మనం ఏమి అనుకుంటున్నాం? దేహమే అనుకుంటున్నాం. అందుచేత మనలో ఉన్న ఆత్మే ఇంకొక రూపం ధరించి వస్తుంది. అది కృష్ణుడో, రాముడో, రమణుడో ఎవరో ఒకరు అనుకోండి మనలో ఉన్న నిజమైన ఆత్మే ఆ రూపం ధరించి వస్తుంది. ఆ రూపం అబద్ధాల పుట్ట కాదు. సత్యం గురించి చెప్పి, సత్యం యందు మనకి ప్రేమ కలిగేటట్టు చేసి, సత్యాన్ని తెలుసుకునే కాంక్ష మనలో కలుగజేసి, సత్యాన్ని తెలుసుకునే మార్గాలు చూపించి, యోగం అంటే ఏమిటో, భక్తి అంటే ఏమిటో వివరంగా చెప్పి బహిర్ముఖం అవుతున్నటువంటి మన మనస్సుని, కలుషితం అయినటువంటి మన మనసుని అంతర్ముఖం చేయటం కోసం, పరిశుద్ధం చేయటం కోసం, మనలో ఉన్న ఆత్మే బాహ్యంగా రూపం ధరించి వచ్చింది. ఆ రూపాన్ని మనం దేవుడు అని అంటాం. మనిషి అంటే ఏమిటి? మనస్సు ప్లస్ శరీరం కలిసి మనిషి అంటాం. మనిషి అంటే శరీరం ఉంటుంది, మనస్సు ఉంటుంది. అయితే మనకి శరీరాన్ని శుభ్రం చేసుకోవటం తెలుసు, మనస్సుని అంతర్ముఖం చేసే శక్తి మనకి సరిపోవటం లేదు. అంటే మనసుని బాగుచేసి మనసుని అంతర్ముఖ పరచడం కోసం, మనలో ఉన్నటువంటి సత్యఆత్మే ఒక దేహం ధరించి వచ్చి మన మనస్సుని అంతర్ముఖ పరుస్తుంది. అందుచేత బాహ్యగురువు



**ఎదుటి వాళ్ళు మన గురించి చెప్పకోవాలి అని కాని, మనకు కీర్తి రావాలి అని కాని, మనకు గొప్పలు రావాలి అని కాని, ఇటువంటి మాటలు మీరు వదిలేసి, మీరు మామూలుగా చేసే పనులు ఈశ్వరుడి ప్రీతికోసం చేస్తే ఈ లోకంలో ఉండగానే, ఈ శరీరం ఉండగానే జ్ఞానులు అయిపోతారు!**

అవసరం. అయితే రమణమహర్షి పొందలేదా? బాహ్య గురువు అవసరం లేకుండా ఆయన పొందితే పొంది ఉండవచ్చు. అటువంటివి rarecases ఉంటాయి. మనం ఎంతసేపు ఎవరు పొగుడుతారా అని కనిపెట్టుకుని ఉంటాం.

CV రామన్ అనే పేరు మీరు వినే ఉంటారు. ప్రపంచ ప్రఖ్యాత సైంటిస్టు, physicsలో చాలా పెద్దవాడు ఆయన. ఈ మధ్యన ఒక రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ చెప్పాడు. బెంగుళూరులో మహాత్మా గాంధీ రోడ్డు అని ఒక రోడ్డు ఉంటుంది. బెంగళూరులో ఏవో పుస్తకాలు కొనుక్కుంటున్నారు బ్యాంకు మేనేజరు గారు, మేనేజరుగారి భార్య. CV రామన్ కూడా అదే టైముకి ఆయన కూడా ఆ పుస్తకాల షాపుకి వచ్చాడు. బ్యాంకు మేనేజరు గారి భార్య భర్తతో చెబుతోంది అట, వారు ఎవరు అనుకుంటున్నావు? అతను physics లో ప్రపంచ ప్రసిద్ధి పొందాడు. ప్రపంచ మేధావులలో ఒకడు. అతనికే నోబెల్ ప్రైజ్ ఇచ్చారు. ఆయనే ఈ రామన్. ఇవన్నీ ఆయనకి వినపడుతున్నాయి. ఆయన మౌనంగానే ఉన్నారు, ఏదో పుస్తకం బేరం ఆడుకుంటున్నాడు ఆయన. మేనేజరు గారు పక్కకి తిరిగి రామన్ గారు అంటే మీరా? మీ గురించి నేను విన్నాను, మీరే రామన్ అని నా భార్య చెబుతోంది, కానీ ఎప్పుడూ మిమ్మల్ని చూడలేదు. మీరు చాలా గొప్పవారు అని, చాలా తెలివిగల వారు అని మీ ఆఫీసు వాళ్ళు నాకు చెప్పారు. అప్పుడు రామన్ గారు ఏమి అన్నారు అంటే మా ఆఫీసు వాళ్ళు బహుశా నన్ను ఎక్కువ పొగిడి మీకు చెప్పి ఉండాలి. నేను మీ లాంటి వాడినే, అది పొగడ్తే కానీ నిజం కాదు. నా గురించి మీకు చెప్పిన మాటలు నిజం కాదు, అది పొగడ్తే అన్నారు. అది పెద్ద వాళ్ళ యొక్క లక్షణం, అది బాగుపడే వాళ్ళ యొక్క లక్షణం. మిమ్మల్ని మీరు హింస పెట్టుకోవద్దు, మీరు శాంతిగా ఉండండి. మీరు ఎంత శాంతిగా ఉంటే అంత ఎక్కువగా భగవంతుడు మీకు బహుమతులు ఇస్తాడు, మిమ్మల్ని అలంకరిస్తాడు. మీరు అందరూ లక్ష్మణుడి తల్లి సుమిత్రని ఆదర్శంగా పెట్టుకోండి. పరిస్థితుల యొక్క ప్రభావం ఎంత తీవ్రంగా ఉన్నప్పటికీ అతి ప్రశాంతంగా శాంత చిత్తం తోటి ఉండగలిగింది లక్ష్మణుడి తల్లి సుమిత్ర. అలా పరిస్థితులని, విధి యొక్క విలాసాన్ని, చాపల్యం లేకుండా ఉన్నది ఉన్నట్టుగా ఎవరైతే ఎదుర్కొగలుగుతున్నారో వాళ్ళని చూసి ఈశ్వరుడు సంతోషిస్తాడు. వాళ్లకి తన స్వరూపాన్ని ఇస్తాడు. కేవలం పూజలు ఒక్కటే సరిపోవు.

మన దైనందిన జీవితంలో మన యొక్క ప్రవర్తన భగవంతుడు మెచ్చుకునేలా ఉండాలి. లోకం కాదు భగవంతుడు మెచ్చుకునేలా ఉండాలి. భగవంతుడు మెచ్చుకునేలా ఉంటే ఆయన స్వరూపాన్ని మనకి ఇస్తాడు. మీకు ఎవరికి అయినా కోరికలు ఉంటేనెరవేరవు అని మీరు అనుకోవద్దు. నెరవేరతాయి. ఎప్పుడు నెరవేర్చాలో, ఎప్పుడు ఇవ్వాలో, మీరు చేసినటువంటి పుణ్యానికి మీకు ఫలితం ఇచ్చేస్తాడు పరమేశ్వరుడు. మాములుగా లోకానికి సంబంధించిన భక్తులు ఏమి చేస్తారు అంటే ముందు బేరం ఆడుకుని తరువాత కొబ్బరికాయ కొడతారు. నిజమైన భక్తుడు ఏమి అడగడు. ఎందుచేత అంటే ఎప్పుడు ఇవ్వాలో, ఎక్కడ ఇవ్వాలో, ఏ జన్మలో ఏది చెయ్యాలో, అది పరమేశ్వరుడికి తెలుసు. అది ఆయనే ఇస్తాడు అని ఏమి అడగడు నిజమైనభక్తుడు. లోకానికి సంబంధించిన భక్తులు ఏమి అనుకుంటారు అంటే మనం అడగకపోతే వాడు ఇవ్వడేమో అని, కొంతమంది జ్ఞాపకం చేస్తూ ఉంటారు. భగవంతుడికి మరుపు ఉంటుందా? భగవంతుడికి మరుపు ఉంటే వాడు భగవంతుడు అవుతాడా? భగవంతుడు అంటే ఏమిటి? సర్వజ్ఞుడు.

ఒక అమ్మగారు నిన్న అడిగారు నాకు మోక్షం వస్తుందా అని? నేను చెప్పాను మీరు ఇప్పుడు మోక్షంలోనే ఉన్నారు అని, కానీ మీరు మోక్షంలోనే ఉన్నట్టు మీకు తెలియటం కోసం, గుర్తింపు కోసం కొంతకాలం పడుతుంది. ఆ కాలం కోసం ఎదురు చూడండి. భగవంతుడు ఎంత బరువైన మోయగలడు. ఆయన శిరస్సు మీద మనం బరువు వేస్తే ఎంత బరువు అయినా మోయగలడు. బరువు ఆయన నెత్తి మీద పెట్టటం మనం నేర్చుకోవాలి. అదే శరణాగతి. మీ బరువు మీరు మోయకండి. మీకు నిజంగా భక్తి ఉంటే ఆ బరువు ఈశ్వరుడి శిరస్సు మీద పెట్టండి. ఈశ్వరుడు ఎంత బరువు అయినా మోయగలడు. అందుచేత తలంపులు ఎన్ని ఉన్నా రానివ్వండి. కంగారు పడకండి. వచ్చిన తలంపుల్ని తొలగించుకోవడానికి ప్రయత్నం చెయ్యండి. ఈశ్వరార్పణంగా పని చేయండి. అలా పని చేస్తూ ఉంటే తలంపులు ఎన్ని ఉన్నా రాలిపోతాయి. ఒక్క మాట మీరు జ్ఞాపకం ఉంచుకోండి. మీరు ఏ గ్రంధాలు అయితే చదువుతున్నారో, మీరు ఏ దేవుణ్ణి అయితే ప్రార్థిస్తున్నారో ముందు ఆ గ్రంధాన్ని ఆ దేవుడిని గౌరవించడం నేర్చుకోండి. మీరు భగవద్గీత చదువుతున్నారు అనుకోండి ఆ పుస్తకాన్ని

గౌరవించడం నేర్చుకోండి. మీరు ఏ దేవుణ్ణి అయితే స్మరిస్తున్నారో, ఏ దేవుడిని అయితే ప్రార్థిస్తున్నారో ఆ దేవుడి యందు మీరు గౌరవం పెంచుకోండి. ఎప్పుడైతే మీరు గౌరవం పెంచుకున్నారో, ఆప్యాయత పెంచుకున్నారో, మీ మనస్సు అక్కడ నిలబడిపోతుంది. మీరు చదివినా మీకు కనుక గౌరవం లేకపోతే మీ మనస్సు అక్కడ నిలబడదు. అటువంటి గౌరవం మీ హృదయంలో ఉందో లేదో చూసుకోండి. మనం సత్వగుణాన్ని అభివృద్ధి చేసుకుంటూ ఉంటే, సత్వగుణంతో జీవిస్తూ ఉంటే వాసనలు వాటంతట అవే రాలిపోతాయి. ఒకొక్కసారి మనకి అనిపిస్తుంది. ఈ తలంపు వద్దు గతాన్ని మర్చిపోవాలి, గతం గొడవలు ఏమి వద్దు అని అనుకుంటున్నప్పటికీ ప్రపంచంలో అన్ని గొడవలు వచ్చీ ఈ బుర్రలో దూరతాయి. గతం వద్దు, గందరగోళం వద్దు, గప్‌చుప్‌గా బ్రతుకుదాం అని నీ మనసుకు అనిపించినప్పటికీ ఆ గతం విడిచి పెట్టదు. అక్కర్లేని స్మృతులు, అక్కర్లేని కోరికలు, అక్కర్లేని గొడవలు ఎక్కువగా వచ్చి మనసుని కదిలించినప్పుడు మనసులో అశాంతి తీసుకు వచ్చినప్పుడు, అది నాడీ మండలంలో పనిచేసి ఆరోగ్యం చెడిపోవటానికి కారణం అవుతుంది. అక్కడ నుంచి రాత్రుళ్ళు సరిగ్గా నిద్ర పట్టదు, రాత్రుళ్ళు ఎప్పుడైతే నిద్ర పట్టదో అప్పుడు గుండె జబ్బులు ప్రారంభం అవుతాయి. భగవాన్ ఏమి అంటున్నారు అంటే నువ్వు కంగారు పడకు. ఆ తలంపు నువ్వు కాదు, ఆ తలంపుల్ని ఆచరణలో పెట్టకు. ఆ తలంపుల్ని గౌరవించకు, వచ్చిన తలంపు వచ్చినట్టుగానే పోతుంది. ఆ తలంపు ఎవడికి అని ప్రశ్న వేసుకో నాకు అని వస్తుంది. నేను ఎవడు అని ప్రశ్న వేసుకో. నేను ఎవడను అనే ప్రశ్న ఎప్పుడైతే వేసుకున్నావో మనసు అప్పుడు అంతర్ముఖం అవుతుంది. మనసు ఆత్మ వైపు ప్రయాణం చేస్తుంది. అంటే దాని పుట్టింటికి ప్రయాణం చేస్తుంది. పుట్టింటికి ప్రయాణం చెయ్యటానికి మనసు వెళుతుంది. ఎపుడైతే మనసు తన పుట్టింటికి వెళ్ళటానికి ప్రయాణం మొదలు పెట్టిందో అప్పుడు వచ్చిన తలంపు, ఆ వచ్చినటువంటి కోరిక, ఆ వచ్చినటువంటి ఆవేశం, వచ్చినటువంటి ఉద్వేగం నెమ్మదిగా తగ్గిపోవటం ప్రారంభిస్తుంది అంటున్నారు. ఇదే సాధన అంటున్నారు రమణస్వామి.

నీకు భగవంతుడి మీద విశ్వాసం లేకపోయినప్పటికీ పునర్జన్మ మీద నీకు విశ్వాసం లేకపోయినప్పటికీ నీ మానసిక ఆరోగ్యం కోసం, నీ శారీరక ఆరోగ్యం కోసం, ప్రతిరోజూ ఒక

గంట సేపు ధ్యానం చెయ్యాలి. మీరు ఆరోగ్యవంతులు అవుతారు. ఈ తలంపులు నిజం కాదు. పూర్వజన్మల్లో మనం చేసినటువంటి పనులే తలంపుల రూపంలో వస్తున్నాయి. అందుచేత మనం పూజ ద్వారా, జపం ద్వారా, ధ్యానం ద్వారా, మనసుని ఈశ్వరమయం చేసుకుంటే ఆ వాసనకి తగిన ఆహరం లేక అది నెమ్మదిగా వాడిపోయి మాడిపోతుంది. మమకారం లేకుండా, అహంకారం లేకుండా మీరు పని చేస్తుంటే జపం తోటి నిమిత్తం లేకుండా కూడా మీకు శాంతి దొరుకుతుంది. భగవంతుడు వాసుదేవుడు చెప్పే శాంతి అనుభవించటం కోసం మీ ప్రాణం పోయే వరకు ఆగనక్కర్లేదు మీరు. తత్వాన్ని తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యండి. తత్వాన్ని మీరు తెలుసుకుంటే మీరు ఇక్కడే మోక్షాన్ని పొందుతారు. ఆ శాంతి ఏమిటో, ఆ సుఖం ఏమిటో మీ శరీరం పడిపోకముందే ప్రాణం పోకముందే ఆ సుఖం మీకు తెలుస్తుంది. ఒక చిన్న మాట మీరు జ్ఞాపకం ఉంచుకోండి. పూర్వజన్మల్లో ఏదైతే మనం ప్రాక్టీస్ చేశామో, అదే ఇప్పుడు వాసనగా వచ్చి కూర్చొంది. మళ్ళీ ఈ వాసనని తొలగించుకోవటానికి మనం ప్రాక్టీస్ చేస్తే అది పోతుంది. ఒకటి వైరాగ్యం, రెండు అభ్యాసం. అసలు నిజమైన సంపద ఏమిటి అంటే వైరాగ్యమే. వైరాగ్యానికి మించిన సంపద లేనే లేదు. ఎన్ని ఆస్తిపాస్తులు ఉన్నప్పటికీ మీకు ఎంత బంగారం ఉన్నప్పటికీ బాహ్యమైన ఐశ్వర్యం మీకు ఎంత ఉన్నప్పటికీ ఈ వైరాగ్యం అనే ఐశ్వర్యం కనుక లేకపోతే ఎవరు మోక్షాన్ని పొందలేరు. ఈ వైరాగ్యం అనే సంపద ఎవరి దగ్గర ఉంది? ఈ వైరాగ్యం అనే ఐశ్వర్యాన్ని ఎవడైనా సంపాదించుకున్నాడా?

వైరాగ్యం అనే ఐశ్వర్యం ఒక్కటే చెల్లుతుంది పరలోకంలో, మిగతావి ఏమి చెల్లవు. మీకు భౌతికమైన ఐశ్వర్యాలు ఎన్ని ఉన్నప్పటికీ, భౌతికమైన గొప్పలు ఎన్ని ఉన్నప్పటికీ

**గురువు ఏమి చేస్తాడంటే, మీలో ఉన్న బలహీనతల వల్ల వచ్చే నష్టం మీకు అర్థమయ్యేలా చెప్పి, మీ బుద్ధితో దానిని పట్టించి, దానిని పోగొట్టుకొనే శక్తి కూడా ఆయన ఇచ్చి మిమ్మల్ని తరింపచేస్తాడు - వాడు గురువు.**



పరలోకంలో నేను ఫలానా ఊరు వాడిని, నేను చాలా పెద్దమనిషిని అని చెప్పినప్పటికీ నువ్వు ఎవరవో నాకు తెలియదు, నీ ముఖం ఎప్పుడూ చూడలేదు. బయటకి పో అని అంటాను అన్నాడు యేసు. ఇంకా మంచి జన్మ వచ్చేయాలా? ఇంకా మంచి లోకంలోకి వెళ్ళిపోవాలా? మీకు రావచ్చు కాదు అనటం లేదు, కానీ మీకు జ్ఞానం మటుకు కలగదు. జ్ఞానం లేనివాడికి మోక్షం లేదు. వాడికి ఆత్మ శాంతి లేదు. వాడు ప్రకృతి లోంచి, మాయ లోంచి, బంధం లోంచి విడువడడు. సత్పురుషుల సహవాసం చెయ్యాలి అని ఆచార్యుల వారు చెప్పారు. మానవజన్మ రావటమే కష్టం. మానవజన్మ వచ్చిన తరువాత జ్ఞానం సంపాదించాలి అనే కోరిక రావటం మరీ కష్టం. ఒకవేళ జ్ఞానం సంపాదించాలి అనే కోరిక వచ్చినప్పటికీ మహాత్ముల సహవాసం దొరకడం ఇంకా కష్టం. ఇవి మూడు ఎవరికి అయితే లభ్యం అయ్యాయో, వాడు ఈ లోకంలో అదృష్టవంతుడు అని చెప్పారు. జ్ఞానం పైనుంచి పోసేది కాదు. లోపల నుంచి ఊరేది, ఆ తపన రావాలి, ఆ ఆకాంక్ష రావాలి. ఆ ప్రేరణ రావాలి, ఎక్కడ నుంచి? మీ హృదయం లోంచి రావాలి. మానవజన్మ రావాలి మానవజన్మ వచ్చిన తరువాత జ్ఞానాన్ని పొందాలి అనేటటువంటి కాంక్ష హృదయం లోంచి పెల్లుబుకి రావాలి. ఆ కోరిక మీకు అభివృద్ధి కావాలి అంటే మహాత్ముల యొక్క సహృదయుల యొక్క సత్పురుషుల యొక్క సహవాసం మీకు దొరకాలి. ఇవి మూడు మీకు దొరికితే మీరు అదృష్టవంతులు. అప్పుడు మీకు శాంత చిత్తం అందుతుంది అంటున్నారు శంకరాచార్యుల వారు.

భగవాన్ ఏమంటున్నారు అంటే వ్యవసాయదారుడు వ్యవసాయ విషయాలను స్మరిస్తున్నాడు. వ్యాపారస్తుడు వ్యాపార విషయాలు స్మరిస్తున్నాడు. భక్తుడు రాముడినో, కృష్ణుడినో, శివుడినో స్మరిస్తున్నాడు. అసలు ఈ స్మరించే వాడు ఎవడు? వాడి జోలికి ఎవరు రారు ఏమిటి? వాడిని అలా విడిచి పెట్టేస్తున్నారు ఏమిటి? అసలు వాడే మీకు దుఃఖానికి కారణం. జపాలు చెయ్యండి కానీ చేసేవాడు ఎవడు? ఎవరు ఈ జపం చేస్తున్నారు? జపం చేయబడేవాడు ఎవడు? జపం చేసేవాడు ఎవడు? ఒక్కటి మాత్రం మీరు జ్ఞాపకం ఉంచుకోండి. మీరు చేసే ప్రయత్నంలో కనుక sincerity ఉంటే మీరు చేసే ప్రయత్నంలో కనుక లౌక్యం లేకపోతే, లోపం లేకపోతే ఈశ్వరుడు తప్పనిసరిగా మిమ్మల్ని

కరుణిస్తాడు. భగవంతుడు తప్పనిసరిగా మిమ్మల్ని అనుగ్రహిస్తాడు. ఆడంబరం కోసం చేస్తున్నారు అనుకోండి లేకపోతే మనం పూజ చేస్తున్నాం అని అందరూ చెప్పుకోవాలి అని మీరు చేస్తున్నారు అనుకోండి భగవంతుడు మిమ్మల్ని కరుణించడు. మీరు చేసే పూజ జపం నిజం అయితే అది హృదయ పూర్వకంగా మీరు చేస్తున్నట్టు అయితే భగవంతుడు తప్పనిసరిగా మిమ్మల్ని కరుణిస్తాడు. మీరు చేసే పూజ కానీ మీరు చేసే జపం కానీ మీరు చేసే ధ్యానం కానీ మీరు చేసే దానం కానీ ఆడంబరం కోసం చేయకండి. కొంతమందికి సంపాదించే తెలివి తేటలు ఉండవు. సంపాదించినప్పటికీ ఎక్కడ ఎప్పుడు అవసరమో, అవసరమైన చోట గుర్తించి అక్కడ ఖర్చు పెడితే వాడు కూడా పుణ్యాత్ముడు అవుతాడు అని తిరువల్లూరులో ఉండే మహాకవి చెప్పాడు.


మీరు దేని గురించి భయపడకండి. ఎందుచేత అంటే భయపడితే దుఃఖం వస్తుంది. ఎవరిని చూసి ద్వేషించకండి. ద్వేషం వచ్చిందా దుఃఖం వచ్చేస్తుంది. మీరేమి భయపడకండి. ఎదుటి వాడిని చూసి ద్వేష పడకండి. ఒకొక్క మంచి గుణాన్ని కష్టపడి సంపాదించుకోండి. మీలో ఒక చిన్న మంచిగుణం ఉన్నప్పటికీ ఆ గుణం మిగతా మంచిగుణాలని సంపాదించి పెడుతుంది. ఒక్క మంచిగుణం హృదయపూర్వకంగా ఆచరించటం కనుక మీరు ప్రారంభిస్తే, ఒక్క మంచి గుణం చాలు. మిగతా మంచిగుణాలని ఇదే సంపాదించి పెడుతుంది. ఈ మధ్య నా స్నేహితుడు ఒకాయన ఉత్తరం రాశాడు. ఆయనకి రమణమహర్షి అంటే చాలా ఇష్టం. ఏవండీ రమణమహర్షి ఏమని చెప్పాడు. రమణమహర్షి చెప్పింది అంతా డికాషన్ అనేవారు ఆయన, శ్రీ కృష్ణుడు - పాండవులు బావ బావమరుదులు, స్నేహితులు, బంధువులు, కృష్ణుడు స్వయంగా భగవంతుడు. అయినప్పటికీ పాండవులకి జీవితం పొడవునా కష్టాలు తప్పలేదు. మరణం తరువాత స్వర్గం వచ్చింది కానీ మోక్షం రాలేదు. దేవుడిని ఎదురుగా పెట్టుకుని, పక్కన సలహాలు చెప్పే గురువు ఉన్నాడు. ఆ గురువు ఎటువంటివాడు? దేవుడే. అటువంటి కృష్ణుడు బంధువు అయినప్పటికీ మార్గదర్శకుడిగా ఉన్నప్పటికీ ఈ పాండవులకి స్వర్గం వచ్చింది కానీ మోక్షం రాలేదు. మరి మోక్షం ఎలా వస్తుంది? దేవుడు కూడా తిరిగినంత మాత్రాన రాదు. ఆత్మవిచారణ చేసి ఆత్మను తెలుసుకుంటేనే మోక్షం వస్తుంది అని చెప్పటం

కోసం ఆయన ఇంత పొడవు ఉత్తరం రాశారు. ఆత్మే నిజం, ఆత్మే మోక్షం, ఆత్మే జ్ఞానం. దేవుడు చెప్పినట్టు విని, దేవుడు చెప్పినట్టు ఆచరించి, ఆత్మను ధ్యానం చేసి, ఆత్మను విచారణ చేసి, ఆత్మను శ్రవణం చేసి ఆత్మను మననం చేసినవాడికి మోక్షం వస్తుంది కానీ దేవుడు వెనకాల దేవుడికి జై, దేవుడికి జై అని గంతులు వేస్తే మోక్షం రాదు అయ్యా పుల్లయ్య అని చెబుతున్నాడు. మీకు బాగా ఏదైతే ఇష్టమో, అది నోట్లో వేసుకునేటప్పటికి మీకు ఎలా ఉంటుందో అలా దేవుడు కనిపించేటప్పటికి మీకు అలా ఉండచ్చు, అది కేవలం నీ మనసుకి తాత్కాలికంగా సంతోషం ఇస్తుంది. అది మనిషి యొక్క గమ్యం కాదు, అది మనిషి యొక్క లక్ష్యం కాదు. అది పరిణామం యొక్క చివరి దశ కానే కాదు. ఏది చివరి దశో, ఏది నిజమో, ఏది పాదమో, ఏది మూలమో అది నీ హృదయంలో ప్రకాశిస్తోంది. భగవంతుడు నీ హృదయంలోనే సత్యముగా, బ్రహ్మముగా, ఆత్మగా ప్రకాశిస్తున్నాడు. నువ్వు ప్రాణాయామం చెయ్యి, జపం చెయ్యి, ధ్యానం చెయ్యి, ఏది చెయ్యి పూజ చెయ్యి ఏది చేస్తావో చెయ్యి, నీకు నచ్చింది చెయ్యి. నీ హృదయం లోపలికి దిగు. నువ్వు ఆత్మవి అనే విషయాన్ని పట్టుకో అప్పుడు మోక్షం, అప్పుడు శాంతి.

నేను నీకు ఎలా కనిపిస్తున్నానో, అలా రాముడో, యేసుక్రీస్తో, అల్లానో ఎవరో వచ్చి నీకు కనిపించినంత మాత్రం చేత అక్కడి తోటి నేను గమ్యాన్ని చేరిపోయాను, నా పని పూర్తి అయిపోయింది అని ఆగకు. అది నిజం కాదు. అది కూడా దృశ్యమే. కనిపించేది అంతా నశిస్తుంది. లోపల ఉంది నిజం, అక్కడకు ప్రయాణం చెయ్యి, సత్యాన్ని పట్టుకో, అప్పుడు నువ్వు విడుదల పొందుతావు. జననమరణ చక్రం లోంచి ఈ సంసారచక్రం లోంచి ఈ దుఃఖసముద్రం లోంచి ఈ బాధల లోంచి ఈ అజ్ఞానం లోంచి ఈ ప్రకృతి లోంచి సడెన్ గా నువ్వు విడుదల పొందుతావు. ఎప్పుడు? నీలో ప్రకాశిస్తున్న వస్తువు నీకు దొరికినప్పుడు మీ రూపం, నామం వీటిని మీరు ఎంత ప్రేమిస్తున్నప్పటికీ ఇవి రెండు నశిస్తాయి. సోదరమహాశయులారా! మీ మనస్సు చల్లబడాలి. మీ మనస్సు ఎప్పుడైతే చల్లబడిందో లోపల ఉన్న ఈశ్వరుడు గుంజుకుంటాడు. అందుచేత మీలో ఎవరైనా మంచి పనులు చేయండి కాని మీరు చేసే మంచి పనులు చూసి మీరు అహంకారం తెచ్చుకోవద్దు. నాకు ఈ మధ్య స్వప్నం వచ్చింది ఆ స్వప్నంలో ఏమి వచ్చింది అంటే సూర్యుడు లేకపోతే ఈ

లోకం లేదు. సూర్యుడు లేకపోతే పంట లేదు, ఏమీ లేదు. ఇంత వెలుగు ఇస్తున్నటువంటి ఈ సూర్యుడికి, ఇంత సంపద ఇస్తున్నటువంటి ఈ సూర్యుడికి నేను వెలుగును ఇస్తున్నాను అనే ధ్యాసే లేదు అసలు. మానవుడికి నేను అనే భావన ఎందుకు? నేను వెలుగు ఇస్తున్నాను అనే ధ్యాస లేదు అంట సూర్యుడికి, అదే విధంగా మీరు మంచి పనులు చేయవచ్చు. మీరు పంటలు పండించవచ్చు, కానీ ఇదంతా నేను చేస్తున్నాను అనే తలంపు తోటి మీరు చేయవద్దు. చేసారా అహంకారం పెరుగుతుంది. అందుచేత సూర్యుడు అంతటి వాడు అలా చేస్తున్నప్పుడు మానవుడికి అహంకారం ఎందుకు అండి?

సోదరమహాశయులారా, ఏదొక రోజున చావు మన అందరి దగ్గరకి పరుగెట్టుకుని వస్తుంది. మనం ఆ చావు దగ్గరకి వెళ్ళక్కర్లేదు. చావే మన దగ్గరకి వస్తుంది. ఆ చావు వచ్చినప్పుడు ఎవరి చేతిలో అయితే చావు ఓడిపోయిందో వాడు జ్ఞాని. మన చేతిలో చావు ఓడిపోతే మనం జ్ఞాని అవుతాం. చావు చేతిలో మనం ఓడిపోతే మనం అజ్ఞానులం అవుతాం. రమణమహర్షి దగ్గరకి చావు వేగంగా వచ్చింది. మహర్షి దగ్గర ఓడిపోయింది. ఆయన మహాపురుషుడు అయ్యాడు. అంటే మరణాన్ని జయించాడు. సోదరమహాశయులారా! మీకు అందరికీ నమస్కారం పెట్టి చెపుతున్నాను ఎంతకాలం అయితే మానవుడు మరణాన్ని జయించలేడో వాడు తిరిగి తప్పనిసరిగా జన్మిస్తాడు. వాడికి కష్టాలు తప్పవు. అసలు జన్మ అంటూ వస్తే ఎటువంటి వాడికి అయినా సరే దుఃఖం తప్పదు. కష్టం తప్పదు. అనారోగ్యం తప్పదు. మళ్ళీ చావు తప్పదు. సాధన సాధన అంటే ఏమీ కాదు. ప్రయత్నం చెయ్యటమే సాధన. మీరు ప్రయత్నం చెయ్యండి ఆ చేసేది ఏదో ఇష్టంగా చెయ్యండి. మీరు చేసే పూజ అయినా సరే మీరు చేసే ధ్యానం అయినా సరే ఇష్టంగా చేయండి. ప్రీతిగా చేయండి. ప్రీతిగా చేస్తే పరమేశ్వరుడు మీలోనే ఉన్నాడు కదా, ఏవండీ ఆయనని




**నీ సాధన నిజమైతే గురువు దగ్గరకు నీవు వెళ్ళనక్కరలేదు.**
**గురువే వచ్చి నీ తలుపు తడతాడు అన్నాడు రామకృష్ణుడు.**

తెలుసుకోవడానికి మనకి వచ్చే ఆటంకాలను అడ్డంకుల్ని ఆయనే తీసేస్తాడు. దారి సరిచేస్తాడు. మీకు నచ్చిన మార్గంలో నడవండి. అది జ్ఞాన మార్గమో, కర్మమార్గమో, భక్తిమార్గమో, ఏదొక మార్గం. మీకు నచ్చిన మార్గంలో మీరు నాలుగు అడుగులు వేయండి. కబుర్లతోటి కాలక్షేపం చెయ్యకండి. భగవంతుడికి మనకి శాశ్వతమైన సంబంధం ఉంది. మిగతా సంబంధాలు అన్నీ కూడా కృత్రిమమే.

మీరు ఎవరు అని ఎవరైనా మనలని ప్రశ్న అడిగారు అనుకోండి ఏమి చెబుతాం మనం? నేను సుబ్బమ్మని, నేను యల్లమ్మని, లేకపోతే మేము బ్రాహ్మణులం, మేము రాజులం అంటారు. అంటే వీళ్ళు అందరికి చావు తప్పదు. చావు చేతిలో ఓడిపోవడం తప్పదు. నువ్వు ఎవరు అంటే నేను బ్రహ్మంను అనే స్ఫురణ వాడికి హృదయంలో కలగాలి. అప్పుడు వాడు చావును జయించగలడు. అంతవరకు సంసారం తప్పదు. ఏది సంసారం? మనస్సే సంసారం. వ్యక్తులు మారవచ్చు, రూపాలు మారవచ్చు, నామాలు మారవచ్చు, లోకాలు మారవచ్చు, ఊర్లు మారవచ్చు, లేకపోతే దేశం మారవచ్చు. ప్రపంచం మారవచ్చు కానీ మనస్సు అనేది ఎంతకాలం అయితే ఉందో అంతకాలం సంసారం తరుముతూనే ఉంటుంది. నన్ను ఈ లోకంలో అందరూ వదిలేశారు, నా బంధువులు వదిలేశారు. ఊర్లో వాళ్ళు వదిలేశారు, స్నేహితులు వదిలేశారు. నన్ను ఎవరు చూడటం లేదు అని ఒకొక్కసారి ఈ మనసుకి అనిపిస్తుంది. భక్తుడు మనస్సుకి ఒకొక్కసారి అటువంటి భావాలు వస్తాయి. ఎందుకు వస్తాయి? అటువంటి తలంపులు ఎందుకు వస్తాయి? సడన్ గా అటువంటి తలంపులు తీసుకు వచ్చి నీ మనసులో ఉన్నటువంటి అడ్డంకుల్ని, ఆటంకాలని, ప్రకృతికి సంబంధించిన ఆధారాలను గొడ్డలి పెట్టి నరికి ఊడగొట్టటం కోసం పరమేశ్వరుడు పన్నిన పన్నాగం అది. ఈ ప్రకృతికి సంబంధించిన ఆధారాలు కనుక మనకి ఎక్కువ కనిపిస్తూ ఉంటే మనకి పొగరుబోతుతనం వస్తుంది. ఈ మధ్యన ఒకతను అన్నాడు మా మనవడు నెలకి పదిహేను వేలు జీతం తెస్తున్నాడు అని గొప్పగా చెపుతున్నాడు. వాడికి దేవుడు ఎక్కడ జ్ఞాపకం వస్తాడు ఇంక, దుఃఖం ఎక్కడి నుంచో రాదు మీ చెడుతలంపులే దుఃఖాన్ని తీసుకు వస్తాయి. మీకు చెడుతలంపులు ఎక్కువ వస్తున్నాయి అనుకోండి పైకి చెప్పొద్దు. భవిషత్ లో మీకు దుఃఖం రావటానికి ఇవన్నీ బీజాలుగా ఏర్పడుతున్నాయి.

ఈ మధ్య పోడూరు డాక్టరు గారు ఒక ఉత్తరం రాశారు. ఈ అమృత వాక్కులు వల్ల ఉత్తరాలు ఎక్కువ వస్తున్నాయి. పోడూరు డాక్టరు గారు రాసిన ఉత్తరంలో ఏముంది అంటే పూర్వం జ్ఞాని అవ్వటం తేలిక కానీ ఇప్పుడు జ్ఞాని అవ్వడం చాలా కష్టం. ఆ మాట మనం అంగీకరించవలసిందే. నేను అంగీకరిస్తున్నాను అని చెప్పాను. ఎందుచేత అంటే పూర్వం ఎవరైనా ఈ ఆధ్యాత్మిక సాధన చేసుకుంటూ ఉంటే ప్రోత్సహించేవారు అట. కాని ఇప్పుడు ఎవరైనా సాధన చేసుకుంటే అందరూ విమర్శించేవాళ్లే. ఇది ఎదురు గాలిలో సైకిల్ తొక్కినట్టుగా ఉంది. సాధన చేసి అభివృద్ధిలోకి వద్దామని ఎవరైనా అనుకున్నప్పటికీ పక్కవాళ్లుఅది ఆర్పేస్తున్నారు. డాక్టరు గారు చెప్పిన విషయాన్ని నారదుడు ఇంకోకలా చెప్పాడు. నారదుడు ఏమి చెప్పాడు అంటే ఇది కష్టం కాబట్టి మీరు తక్కువ ప్రయత్నం చేసినప్పటికీ భగవంతుడు ఎక్కువ ఫలితం ఇచ్చి మిమ్మల్ని జ్ఞానిని చేసేస్తాడు. పేపర్ కష్టంగా ఉన్నప్పుడు తేలికగా దిద్దుతారు. సమాజం వ్యతిరేకంగా ఉన్నప్పటికీ మీరు ఈ మాత్రం సాధన అయినా చేశారు కాబట్టి భగవంతుడు తీసుకెళ్లి మీకు తొందరగా జ్ఞానం ఇస్తాడు. అందుచేత ఆ రకంగా కలియుగం కూడా గొప్పదే అన్నాడు నారదుడు. మనం చేసే సాధనకి మనకి ప్రోత్సాహం మాటలు ఎవరు చెప్పరు. సినిమా చూసి వచ్చాం అనుకోండి ఎవరు ఏమి అనరు. ఉపన్యాసాలకి వెళ్లి వచ్చాం అనుకోండి, ఎందుకండీ మీకు ఇప్పటి నుంచి ఆ గోల అంటారు. అంటే మనకి ప్రోత్సాహం ఎవ్వరూ ఇవ్వరు. మన కాళ్ల మీద మనమే నిలబడాలి ఈ మార్గంలోకి వచ్చినప్పుడు అందుకు చెబుతున్నాను. అందుచేత పరిస్థితులు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ మీ కుటుంబంలో పరిస్థితులు, మీకున్న ఆర్థిక పరిస్థితులు, మీకు ఉన్న ఆరోగ్య పరిస్థితులు, మీకున్న సమాజ పరిస్థితులు, మీకు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ మీరు చెయ్యగలిగే సాధన మీరు చేయండి. ఈశ్వరుడు మిమ్మల్ని అనుగ్రహిస్తాడు. మీరు శాంత చిత్తాన్ని విడిచి పెట్టకండి సాధ్యమైనంత వరకు శాంతిగా ఉండండి. మీరు శాంతిగా ఉంటే మీ చుట్టూ ఉన్న పరిస్థితులు కూడా శాంతి పడతాయి. ఒకవేళ మీ చుట్టూ ఆందోళన పరిస్థితులు ఉన్నా మీరు ఆందోళన చెందవద్దు. మీరు శాంతిగా ఉండండి. మీ సమస్యలను కాలం పరిష్కారం చేస్తుంది. మీరు పరమేశ్వరుణ్ణి స్మరించండి. ఆ పరమేశ్వరుడు మీకు అన్నీ సమకూరుస్తాడు.

**రమణ సత్యం, రమణ శివం, రమణ సుందరం**



# అరుణాచల మహత్మ్యం
# అక్షరమణమాల

**వల నుంచి భక్తుల పరిమార్చు నిను గట్టు**

**కొని యెటు జీవింతు నరుణాచలా ॥ 24 ॥**

**తాత్పర్యము:** ప్రకృతి వలలో పడి కొట్టుకొంటున్న భక్తుల అహంకారాన్ని హతమార్చుటయే పనిగా పెట్టుకొన్నావు. అటువంటి నిన్ను కట్టుకొన్న నన్ను మాత్రము అహంకారముతో ఎలా జీవించనిస్తావు అరుణాచలా?

ఒకో మనిషి ద్వారా ఒక్కో పని అవుతుంది. డాక్టరుగారి దగ్గరికి వెళ్ళితే వైద్యం చేస్తారు కానీ, ఒంతెన కట్టమంటే కట్టలేరు. అరుణాచలేశ్వరుడికి పని ఏమిటంటే, అరుణాచలా, అరుణాచలా, అరుణాచలా, అని ఎవరైతే ఆయనను స్మరిస్తున్నారో వారి అహంకారాన్ని తొలగిస్తాడు. అంటే శుభ్రంగా నాశనం చేసి విడిచిపెడతాడు.

అరుణాచలా! నువ్వు జీవుల యొక్క అహంభావనను నాశనం చేసే పని పెట్టుకున్నావు. ఎందుకంటే, మాకు అందరికీ సుఖం కావాలి, శాంతి కావాలి, కానీ అహంకారాన్ని విడిచిపెట్టలేక పోతున్నాము. అహంకారం పోతేనే కాని సుఖం అనేది ఎలా ఉంటుందో తెలియదు కాబట్టి, ఎవరైతే అరుణాచలా, అరుణాచలా అని నిరంతరము స్మరిస్తున్నారో, వారియొక్క అజ్ఞానాన్ని, అవిద్యని మూలంతో సహా నాశనం చేస్తావు.

అందరినీ నాశనం చేసే స్వభావం కలవాడవు నువ్వు. వ్యక్తిభావనను తీసేయటమే పనిగా పెట్టుకొన్న నిన్ను కట్టుకొని నేను కూడా జీవించలేను. అంటే, నేను నీలో లయం

అయిపోతాను. ఇది ఆధ్యాత్మికమైన పెళ్లి, పరమాత్మలో కలిసే పెళ్లి. వ్యక్తిభావన ఉంటే, ఈశ్వరుడిలో కలవటానికి అవకాశం లేదు. భౌతికమైనటువంటి మ్యారేజ్ లో మరణించేవరకూ స్త్రీకి పురుషుడికి సెపరేట్ ఎగ్జిస్టెన్స్ ఉంటుంది. ఆ ఇంటిలోపెత్తనం కోసం, ఆధిఖ్యత కోసం భౌతికమైన పెళ్లిళ్లలో ఎంతో పోరాటాలు జరుగుతున్నాయి. ఇది అటువంటి పెళ్లి కాదు. సెపరేట్ ఎగ్జిస్టెన్స్ తో సంబంధం లేదు ఇక్కడ. నువ్వు నీ పూర్తి స్వరూపాన్ని నాకు ఇచ్చేయటం కోసం, ఈ నేను అనే వ్యక్తిత్వాన్ని నాశనం చేయటానికి కంకణం కట్టుకున్నావు అరుణాచలేశ్వరుడా. నీ పూర్ణస్వరూపమును, నీ పూర్ణస్థితిని ఇవ్వటం కోసం! ఈ దేహభావనను తొలగించే స్వభావం కల నిన్ను కట్టుకొని, నేను మట్టుకు దేహభావన మిగుల్చుకోగలనా అరుణాచలా! ఈ పెళ్లి భౌతికమైనటువంటి ఎంజాయ్మెంట్ కోసం కాదు. దేహభావనను దాటి, మానసికభావనను దాటి, తన కాంక్షలను దాటి, ఈ భౌతికమైనటువంటి పరిధులు అన్నీ దాటి ఆత్మ స్థితిని పొందటం కోసం, ఆత్మ శాంతిని, ఆత్మ సుఖాన్ని, ఆత్మ వైభవాన్ని పొందటం కోసం జరిగే పెళ్లి.

మన అహంకారాన్ని సంతృప్తి పరుచుకోవటం కోసమే మనం సాధనలు అన్నీ చేస్తాము. దానిని తొలిగించుకోవటానికి మనం చేసే ప్రయత్నాలు తక్కువ. నువ్వు ఎంతటి వాడవి అయినప్పటికీ, నీ జీవలక్షణాలు కనుక నువ్వు పోగొట్టుకోకపోతే, ఈశ్వరుడు తన స్వరూపాన్ని ఇవ్వడు. అరుణాచలా, అరుణాచలా అని ఎవరైతే నిన్ను నిరంతరం స్మరిస్తూ ఉంటారో, వాళ్ల అజ్ఞానాన్ని తొలిగించి, వాళ్ల జీవలక్షణాలు తీసేసి, వాళ్లకి నీ స్వరూపాన్ని ఇస్తావు. అదే పనిగా ఉన్నావు. ఆ పని పూర్వం చేసావు, ఇప్పుడు చేస్తున్నావు, భవిష్యత్తులో అరుణాచలేశ్వరుడా నీ పని అదే. అట్టి అరుణాచలేశ్వరుడివైన నిన్ను కట్టుకొని ఎటు జీవింతును అరుణాచలా. ఎటు జీవింతును అంటే, వ్యక్తిగతమైన జీవితం కాదు. ఎవరైతే ఆత్మ జీవితాన్ని పొందాలి అనుకొంటున్నారో, వాళ్ళు అందరూ మరణించాలి. శాశ్వతమైన జీవితం కావాలి అనుకొనే వాళ్లందరూ అహంవృత్తిలో మరణించాలి. అహంవృత్తిలో, ఈ తాత్కాలిక జీవితంలో

మరణించినవాడే శాశ్వతమైన జీవితంలో మేల్కొంటాడు. ఈ అహంకారగతమైన జీవితంలో మరణించకుండా అందులో పుడతాము అంటే అది సాధ్యం కాదు. వాక్కుని అర్పించి, మనస్సుని అర్పించి, శరీరాన్ని అర్పించి, ధనాన్ని అర్పించి, తన గౌరవాన్ని అర్పించి, నాది నేను అనుకొనే సమస్తమూ నీకు అర్పించి, ఎవడైతే జీవిస్తున్నాడో వాడికి అజ్ఞానం పోతుంది, అహంకారం పోతుంది. ఎవడికైతే ఈ అజ్ఞానం, అహంకారం యొక్క మూలం తెలుస్తుందో, వాడికి మాత్రమే అవి తొలగించబడతాయి.

ఓ అరుణాచలేశ్వరుడా నిన్ను గట్టుకొని ఎవరు జీవించ గలరు అయ్యా? నేను రమణుడుని, పెద్ద గొప్ప వాడిని అవ్వాలి అని ఈ వ్యక్తిభావనని, అజ్ఞానాన్ని, నా కాంక్షలని పెంచుకుందామని అనుకున్నా, నువ్వు పెంచుకోనివ్వవు. నీ స్వభావమే అదయ్యా! ఈ వేరుభావనని తీసేసి, నీ స్వరూపాన్ని నాకు ఇచ్చి, నీ అంతటి వాడిని చేస్తావు అరుణాచలా! జ్ఞానిని ఆశ్రయిస్తే తనంతటి వాడిని చేస్తాడు జ్ఞాని. ఈశ్వరుడిని ఆశ్రయిస్తే, ఈశ్వరుడు తనంతటి వాడిని చేస్తాడు. అటువంటి గొప్ప పెళ్లి! ఈ పెళ్లికూతురు ఎటువంటి లోతులకి వెళ్లి, ఎటువంటి ఎత్తులకి ఎదిగి, ఎటువంటి మ్యారేజ్ కోరుతోంది, ఎక్కడ విహరించాలని కోరుతోందో, అది చూడండి, ఆనందించండి. అటువంటి డివైన్ మ్యారేజ్ ఇది!


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక **శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**, అకౌంట్ నెంబర్ **520101264185724** (**IFSC Code : UBIN0916137**) నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**

**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**

IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# శంకర భగవత్పాదులు

సుమారు 1230 సంవత్సరముల క్రితము కేరళ రాష్ట్రంలోని కాలడి గ్రామంలో, శివగురువు, ఆర్యాంబ పుణ్య దంపతుల వరప్రసాదముగా శ్రీ శంకరులు జన్మించారు. ఆయన ఈ భూమి మీద శరీరధారియై ఉన్నది 32 సంవత్సరములు మాత్రమే! ఆయనకు ఎనిమిది సంవత్సరముల వయస్సు వచ్చేసరికి పరిపూర్ణుడు అయ్యాడు. తరువాత కాలంలో ఆయనే జగద్గురువు ఆదిశంకరాచార్యులుగా జగత్ప్రసిద్ధి గాంచారు. ఆదిశంకరుల గురువు గోవిందభగవత్పాదులు. భారతీయ తాత్విక చింతనను శిఖరాగ్రాలకు చేర్చిన మహనీయుడు ఆదిశంకరుడు. జీవకోటిని కల్పిత అజ్ఞానము నుండి విముక్తులను చేయడానికి, పరమశివుడే గురురూపంలో ఈ భూమిపై శంకరునిగా అవతరించాడని చెబుతారు. పరమశివుని ప్రతిరూపమే ఆదిశంకరుడు! ఆయన జ్ఞాన సూర్యుడు, అద్వైత జ్ఞానం ఆయన ఆస్తి, సొత్తు. జ్ఞానవిద్యను అందించిన మేటి ఆచార్యుడు. ప్రయాణ సదుపాయములు లేని ఆ రోజులలో, దేశమంతా సంచరించి, దేశము నాలుగు దిక్కులలో, నాలుగు శంకర మఠాలను స్థాపించి, జ్ఞానమార్గాన్ని, గురుశిష్య సాంప్రదాయాన్ని శాశ్వతంగా ఉండే విధానాన్ని నెలకొల్పారు. శ్రీ శంకరుడు ప్రస్థాన త్రయ భాష్యాలను, వేదాంత తత్త్వ ప్రతిపాదకాలైన ఆత్మబోధ, అపరోక్షానుభూతి, వివేకచూడామణి వంటి గ్రంథాలను అట్లే అనేక భక్తి, స్తోత్ర గ్రంథాలను రచించారు. ఆయన జ్ఞానసముద్రుడు. శంకరుడు అంటే సద్గురువు శ్రీనాన్నగారికి ఎంతో ప్రీతి. తరచు శంకరుల తత్త్వబోధను భక్తులకు అందించేవారు. "జీవుని యదార్థ స్వరూపం సచ్చిదానందమే! తాను అద్వితీయ, ఆనందస్వరూపుడే కానీ, దేహాత్మబుద్ధి కారణంగా జనన మరణ రూప సంసారచక్రంలో చిక్కుకుంటున్నాడు. కాబట్టి జనన మరణ రూప సంసారమునకు కారణమైన అహంకారాన్ని తొలగించుకొనుటయే నిజమైన సాధన. మనోనాశము ద్వారా స్వరూప అమృతస్థితిని అనుభవైకవేద్యం చేసుకోవడమే మానవ జీవిత గమ్యం. జీవుడు వేరు, ఈశ్వరుడు వేరు అన్న భేదభావన భ్రమచే కలిగినది కాబట్టి, భేదబుద్ధి నశిస్తే తాను ముక్తుడవుతాడు" అన్నది శంకర ఉవాచ. సూర్యభగవానుడు కమలాలను వికసింపజేసే విధంగా, శ్రీ శంకరుడు ముముక్షువుల హృదయకమలాలను జ్ఞానభాస్కరుడై, నిరంతరం వికసింపజేస్తున్నారు!

**(ది॥ 17-05-2021 శ్రీ శంకర జయంతి సందర్భంగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# భయం బానిసత్వాన్ని ఇస్తుంది - స్వేచ్ఛ రెక్కలను ఇస్తుంది

'నేను దేహాన్ని' అనే భ్రమే విత్తనం కారణంగా మానసిక ఆందోళనలు, భయాలు అన్నీ ప్రారంభమౌతాయి. శరీరమే నేను అనే భ్రమ కారణంగా భాహ్య ప్రపంచంలో నేను నిష్పక్షపాతంగా వ్యవహరించలేకపోతున్నాము. ఈ మోహపు విలువలతో వ్యక్తి పొందే బాధలే సంసారంగా గుర్తించబడుతున్నది. బృహదారణ్యకోపనిషత్ "రెండవది కనిపిస్తే భయం ఉండి తీరుతుంది" అంటోంది. గౌరవాన్ని కోరుకొనే వ్యక్తి తనతో సమానమైన గౌరవాన్ని ఎవ్వరికీ ఇయ్యడు. వాడికి అవమాన భయం ఉండనే ఉంటుంది. రాజ్య సంపద వల్ల అది చెయ్యి జారిపోతుంది అనే భయం, ధనం వల్ల దోచుకుపోతారనే భయం, అధికారం పోతే అవమాన భయం, శక్తిశాలి వల్ల శత్రు భయం, శాస్త్రపాండిత్యంతో అసూయపరుల భయం, శరీరానికి మృత్యు భయం కలుగుతాయి. ఒక గురువు గారితో శిష్యుడు "అయ్యా! నన్ను అందరిముందు దూషిస్తూ ఉంటే దాన్ని నేను ఎలా సమాధానపడాలి?" అనగా గురువుగారు "అందరి ముందూ జరిగినా, ఒంటరిగా జరిగినా తేడా ఏముంది? అసలు అందరూ ఉన్నారా?" అన్నారు. ఈ మాట అనుభవజ్ఞాని మాత్రమే అనగలడు. తనకన్నా భిన్నంగా చూచే పరిస్థితి తారసపడదు. సాధకుడు సునిశిత బుద్ధి, నిర్మల కుశాగ్రబుద్ధితో గ్రహిస్తే విషయాన్ని తేలికగా తీసుకోగలడు. ఒక్క వైరాగ్యం వల్ల మాత్రమే భయం దూరమవుతుంది. ద్వేషం ఎక్కడ ఉందో అక్కడ హృదయం అపవిత్రమైపోతుంది. మనం మన సమస్యలను ముఖాముఖి ఎదుర్కోవాలి, మనస్సు వేదనకు, భయానికి గురి అయినప్పుడు దానిని ఎదురొడ్డి నిలవాలి. దుఃఖాన్ని తటస్థ భావంతో గమనిస్తూ పోతూ ఉంటే మన భయాలకు మూలకారణం చేరుకొంటాము. మన దుఃఖం నుంచి విడుదలౌతాము. మనలోని కల్మషాలను అణచివేయలేము అవి పొరలు పొరలుగా వస్తూనే ఉంటాయి దానికి గురుకరుణ శరణ్యం. నేడు కరోనా భయం తలచుకొంటేనే గుండె ఆగిపోయిన వారు ఉన్నారు. భార్యను బాల్కనీలో ఉండి నన్ను చూడు అని చెప్పి భర్త గేటులోంచి చూచుకొని టాటా చెప్పే హృదయ విదారకమైనవి చూస్తున్నాము. కరోనా ఉంటే భార్య భర్తను, భర్త భార్యను సమీపించలేడు. అపార్ట్‌మెంట్‌లో అయితే కరోనా రోగిని భయానకంగా చూస్తారు, తలుపులు వేసుకొంటారు. మరో ప్రక్క మానవత చూపుతూ డాక్టర్లు, నర్సులు పనిచేస్తున్నారు. ఈ భయం ప్రపంచమంతా ఉంది. భయంకరమైన సమస్య వింటే ముందు మలవిసర్జనకు పారిపోతారు. భగవాన్ చెప్పినట్లు ఊరక ఉండటమే మందు. వేదాంత దృష్టితో చూస్తే వివేకం వికసించి వైరాగ్యంగా మారుతుంది. ఏది నిత్యం, ఏది అనిత్యం అని గుర్తించగలిగినప్పుడు అనిత్యమైనదానిమీద సహజంగా మోహం తగ్గుతుంది. వివేకం కలుగుతుంది. ఇందులో కష్టపడవలసినది, భయపడవలసినది ఏమీ లేదు. ఈ సృష్టినంతా చూచే భగవంతుడు మనలను చూడడా అని నిశ్చయానికి రావాలి. అప్పుడే స్వేచ్ఛగా ఉంటాము.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**